# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293280, 2293206, 9299656267

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



సంపాదక వర్గము

గూడూరి వెంకట రత్నం

డి.జె. బాలకృష్ణ లాల్

డా॥ఎస్. రామతారక పరబ్రహ్మ శాస్త్రి

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి



సంపుటి 34 సంచిక 6

పేజీలు 40

ఫిబ్రవరి 2015

**5సం॥ల చందా రూ. 250**

**2సం॥ల చందా రూ. 120**

**సంవత్సర చందా రూ. 60**

**విడిప్రతి వెల...... రూ. 5**

బ్యాంక్ డ్రాఫ్టు A/C Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508

printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


భద్రవాక్యం ..................................2

శ్రీబాబూజీ ఉవాచ...............................3

అమ్మమాట.............................................6

సన్నిధిలో సంభాషణ ............................8

యోగవాశిష్ఠము ................................11

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు....................13

పరిప్రశ్నేన సేవయా...........................14

సద్గురు శ్రీయాత్రా దర్శన్.......................15

కలనైనా మీ స్మరణే .................... ............... 16

గీతాధ్యయనమ్.................................18

శ్రీకృష్ణకర్ణామృతము............................20

శ్రీబాబు దివ్యవాణి.............................22

మరచిననూ మరపురారు......................23

మాఘం ........................................25

ప్రశ్నోత్తరాలు.....................................27

భోగి - భోగం.....................................29

గోవింద దేవాలయ అర్చకులు................31

సత్సంగామృతం..................................32

హనుమద్వైభవము............................34

సమర్థ సద్గురునాథుని దివ్య చరిత్ర...........36

విష్ణు కథలు- భక్త కబీర్‌దాస్................39

## భద్రవాక్యం - పరాశర ప్రసాద్

నిరస్త విషయా సంఙ్గమ్ । సన్నిరుద్ధమ్ మనోహృది ।
యదా యాత్యాత్మనో భావమ్ । తదా తత్పరమం పదమ్ ॥
(అమృతబిన్దూపనిషత్ 4శ్లో)

పూర్ణత్వములో కొరతకు రాజీపడటానికి సావకాశము ఉండదు కదా! పున్నమి వెన్నెల కాంతిని దర్శించాలంటే పౌర్ణమి తిథికి ఒకరోజు ముందుగాని, ఒకరోజు తరువాతగాని, సాధ్యపడదు కదా!

అలాగే మనస్సు విషయాసక్తిని త్యజించటం అనేది నిరుద్ధ స్థాయిలో ఉండాలి. నిరుద్ధ స్థాయి అంటే మనస్సు సర్వకాల సర్వావస్థల యందు తత్త్వభావనలోనే నిలిచి ఉండాలి. అక్కడ విషయాదులకు స్థానం ఉండదు. విషయాదులు అంటే తినటం, త్రాగటం, నిదురించటం అనే భావన తప్పు. విషయాదులు అంటే తన భావనలో, చింతనలో, క్రియలో ఇంద్రియపరంగా గాని, దేహపరంగా గాని, వ్యవహరించటము.

'ఆత్మ' అంటే 'నేను' అని అందరికి అవగతమైనదే. కాని వ్యవహారంలో నేను, నాది అనేవి మనస్సు దేహభావనతో, ఇంద్రియ భావనతో ప్రయోగించేదే కాని, ఆత్మభావాన్ని పొంది చేసే స్మరణ కాదు. దానికి భిన్నంగా మనస్సు సదా ఆత్మభావనలోనే నిలబడాలి అంటే విషయాసక్తిని విడిచిపెట్టాలి. దానికి సంకేతము మనస్సు పరమమైన స్థానం స్థిరమైన స్థితి. అక్కడ ద్వైత భావాన్ని కోల్పోతుంది. ఆత్మని అధిరోహిస్తుంది. ఆ స్థితిలో సాధకుడు 'నేను' అనే తనను గురించి తాను ఎరుకలో ఉంటాడు. ఆ స్థితిలో బ్రహ్మానందాన్ని అనుభవిస్తాడు. అక్కడ ద్వైతము లేదు. ఈర్ష్య అసూయలు, రాగ ద్వేషాలు లేవు.

# శ్రీ బాబూజీ ఉవాచ

- పరాశర ప్రసాద్

శ్రీ బాబూజీ మహరాజ్ భక్తులకు బోధిస్తూ "అహంకారాన్ని త్యాగంచేసి ఏ విధమైన ప్రతిఫలాన్ని ఆశించకుండా ఆచరించిన ఏ కర్మ ద్వారానైనా భగవంతుని కృపకు అర్హతను సంపాదించుకోవచ్చును. ఇటువంటి జీవనాన్ని కొనసాగించే



గృహస్థులంతా కర్మయోగాన్ని ఆచరించినవారవుతారు. అటువంటివారు కూడా ధన్యులే. కానీ మానవుడు ఆచరించే కర్మ రాగ ద్వేషాలతో, ఈర్ష్య అసూయలతో, కామ క్రోదాధి గుణాలతో, లేక ఒక దుష్ట సంకల్పంతో, మనసు సహితంగా ఆచరించినట్లయితే అది దుష్కృత కర్మ అనబడుతుంది. ఆ కర్మకి కర్తవి నీవే కనుక దాని ఫలితాన్ని అనుభవించక తప్పదు. అలా కాకుండా మానవుడు ఏ పని చేసినా భగవంతుని సేవకునిగా లేక తాను చేసే కర్మ భగవంతుని సేవగా భావించినట్లయితే అది సుకృత కర్మ అని పిలువబడుతుంది. అటువంటి భగవత్సమర్పిత కర్మకు కర్తవు నీవు కావు. కనుక ఆ కర్మ ఫలితం ఎటువంటిదైనా అది నీకు అంటదు. ఈ పని నేను చేస్తున్నాను. ఈ ప్రజ్ఞ నాది అనే కర్తృత్వ భావన ఉండకూడదు. మానవుడు ఏ పనిచేసినా ప్రతిఫలాపేక్ష లేకుండా, నేను చేస్తున్నాను అనే భావన లేకుండా చేసిన కర్మ ద్వారా పుణ్యఫలాన్ని ఆర్జించి, ఉత్తమగతిని పొందటం తథ్యము."

కొంతమంది మానవులు 'మేము సత్ ప్రవర్తన కలిగివుంటాము. అన్నీ మంచిపనులనే చేస్తాము. మేము భగవంతుని ఆరాధించవలసిన పని ఏముంది?' అని ప్రశ్నించే వారికి సమాధానం చెపుతూ........

"అటువంటి సత్ ప్రవర్తన కలిగినవారు తప్పక స్వర్గలోక సుఖాలను పొందవచ్చు అంతేకాదు వారికి ఉత్తమజన్మ ప్రాప్తించవచ్చు కానీ, జన్మరాహిత్యం కలుగదు. ఎందువలన అంటే మానవుడు శమము, దమము అనగా ఇహలోక, పరలోక సుఖాలను త్యాగం చేసినపుడే మోక్షప్రాప్తికి అర్హుడు. అని శాస్త్రాలు చెప్తున్నాయి.

ఫలితాన్ని ఆశించకుండా, కర్తృత్వ భావన లేకుండా నిర్వహించే

కర్మ, కర్మలో అకర్మ అని పిలువబడుతుంది ఉదాహరణకు కంటితో ఏ వస్తువునైనా చూసినా, చెవితో ఏ శబ్దాన్ని అయినా వినినంతమాత్రం చేత ఆ కర్మ నీకు అంటదు. కాని కంటితో ఒక దృశ్యాన్ని చూసి మనస్సు ద్వారా వికారభావం కలిగినా, చెవితో ఒక శబ్దాన్ని విన్నా అక్కడ మనస్సు ప్రవేశించి ఏదైనా సంకల్పము కలిగితే ఆ కర్మ నీకు అంటుతుంది. కాబట్టి ఇంద్రియాలతో ఏ కర్మ ఆచరించకపోయినా మనస్సు సంకల్పించినంత మాత్రం చేత మానవుడు కర్మను మూటకట్టుకుంటున్నాడు. దీనినే అకర్మలో, కర్మ అంటారు.

ఇక్కడ మీకొక ఉదంతం చెపుతాను. ఒక గ్రామంలో ఊరికి వెలుపల ఒక కుటీరం నిర్మించుకొని ఒక సాధువు నివసిస్తున్నాడు. ఆయన కుటీరానికి సమీపంలో ఒక వేశ్య చిన్న గృహాన్ని ఏర్పరచుకొని జీవిస్తోంది. ఆమె భక్తురాలు. గత్యంతరం లేక తన జీవన విధానంపై విరక్తి చెందినప్పటికీ భగవంతుని నమ్ముకొని జీవిస్తోంది. కానీ సాధువు దృష్టి మాత్రము ఆ వేశ్య ఇంటిపైనే వుంది. ప్రతిరోజూ ఆమె ఇంటికి ఎవరెవరు వచ్చేది గుర్తిస్తూ ఆమె జీవన విధానాన్ని తిట్టుకొంటూ, తన కర్తవ్యాన్ని మరచి కాలాన్ని గడుపుతున్నాడు.

చూశారా! ఈ ఇరువురి వ్యక్తులలో వేశ్య తాను తప్పు పనిచేసినా తన మనస్సు భగవంతుని యందే నిలపటం చేత ఆమె చేసే కర్మ, కర్మలో అకర్మ అయ్యింది. కాబట్టి ఆమెకి ఉత్తమ గతి ప్రాప్తిస్తుంది కాని సాధువు తన కర్తవ్యాన్ని మరచి తన మనస్సుని తనకు సంబంధం లేని వేశ్య యొక్క జీవిత విధానంపై నిలపడం ద్వారా తాను కర్మ చేయక పోయినా కర్మను మూటకట్టు కొంటున్నాడు. కాబట్టి ఇది అకర్మలో కర్మ అవుతుంది.

మీకు ఇంకొక దృష్టాంతం చెపుతాను. జీవితం మీద విరక్తి కలిగిన ఒక మహారాజు సర్వాన్ని త్యాగం చేసి అరణ్యానికి వెళ్ళి ఒక చెట్టుకింద తపస్సు చేసుకుందామనే తరుణంలో, ఆ చెట్టుపైన వున్న పక్షుల సంభాషణ విని మనస్సు అటువైపు మళ్ళింది. ఆ పక్షుల సంభాషణ ద్వారా ఒక గ్రద్ద, ఒక పామును ఎత్తుకుపోతుండగా ఆ పాము వదిలిన విషపుచుక్కలు మహారాజుగారి ఇంటికి తీసుకువెళ్ళే పాలబిందెలో పడ్డాయి. ఆ పాలు త్రాగిన వారు చనిపోయారు. ఈ పాపానికి కారుకులెవరో నిర్ణయించడానికి యమధర్మరాజు చిత్రగుప్తునితో చర్చించిన విషయం

పక్షులు మాట్లాడుకుంటున్నాయి. మహారాజుగారి దృష్టి ఈ సంభాషణ పైకి మళ్ళింది. తాను అరణ్యానికి వచ్చిన సందర్భాన్ని, కర్తవ్యాన్ని మరచాడు. ఇటువంటి కర్మని ఏమంటారు? అకర్మలో కర్మ అని పిలువబడుతుంది.

నీకు సంక్రమించే జన్మ పరంపరగాని నీ జీవన విధానంగాని నువ్వు పూర్వజన్మలో ఆచరించిన కర్మను అనుసరించి వుంటుంది. కాబట్టి సమర్థులైన సద్గురు మూర్తిని ఆశ్రయించి ఎన్నో జన్మల నుంచి ఆర్జించిన కర్మ వాసన ఆయన ప్రసాదించిన లక్ష్యార్థముపై మనస్సు నిలిపి, దాని ద్వారా రహితం చేసుకోవచ్చు.

"కర్మేంద్రియాణి సంయమ్యయఅస్తే మనసాస్మరన్
ఇంద్రి యార్థాన్ విమూఢాత్మా మిథ్యా చారః సఉచ్యతే"

విధి వ్రాతని త్రిమూర్తులెవరు తప్పించలేరు. విధి నిర్ణయం అంటే దైవ నిర్ణయం అన్నమాట. దానిని తప్పించగల సమర్థత సద్గురు మూర్తికి మాత్రమే వుంటుంది. మానవుడు తాను ఆచరించిన సత్కర్మల ద్వారా ఉత్తమగతిని పొందుతున్నాడు. దుష్కృత కర్మల ద్వారా నరక ప్రాప్తి కలుగుతుంది" అన్నారు. శ్రీ బాబూజీ మహారాజ్

## గ్రుడ్డి అనుకరణ పనికిరాదు

ఆదిశంకరులకు ఒక తెలివితక్కువ శిష్యుడుండేవాడు. అతడు గురువుగారిని అన్ని విషయాలలో అనుకరిస్తూ ఉండేవాడు. శంకరాచార్యులు 'శివోఽహం' అంటే శిష్యుడు కూడా 'శివోఽహం' అనేవాడు. శిష్యుడి లోపాన్ని సరిదిద్దాలని శంకరులు అనుకున్నారు.

వారు వెళ్ళే త్రోవలో ఒక కంసాలి అంగడి ఉంది. శంకరులు అక్కడ పాత్రలో అప్పుడే కరుగబెట్టి ఎర్రగా మండుతూ ఉన్న ఇనుము చూశారు. దానిని తీసుకుని శంకరులు గడగడా త్రాగేశారు. శిష్యుణ్ణి కూడా త్రాగమన్నారు. గురువుగారు చేసిన ఈ పనికి మాత్రం శిష్యుడు అంగీకరించ లేకపోయాడు. అప్పటి నుండి 'శివోఽహం' అనటం కూడా మానివేశాడు.

- శ్రీరామకృష్ణులు

## అమ్మ మాట

- జపమాల ప్రసాద

### మాయ రోగాన్ని హరించేది ఒక్క సద్గురు దేవుడే!

ఆశ్రమం గురుదేవుడి స్వరూపము. భక్తులందరూ ఎంతో ఆవేదనతో వేడుకుంటే, ఈ ఆశ్రమం నెలకొల్పారు. ఆయన తపస్సు అంతటినీ ధారపోసి, భక్తుల ఉద్దేశ్యంతో, బాబు ఆశీస్సులతో ఈ ఆశ్రమం నెలకొంది. 'బాబు' అనే రెండు అక్షరాలకి ప్రతివాడూ బందీ అయి పోయాడు. పట్టణాలలో ఉండే బాధలు కోకొల్లలు. మన ఆశ్రమం 'మరో ప్రపంచం'.

మన ఆశ్రమంలో ఉన్న సదుపాయాలు - నీళ్ళు, కరెంట్, పాలు, ఒకటేమిటి! సమస్తమూ మన గుమ్మం దగ్గరికి వస్తున్నాయి! మనకేమి లోటు? మన గొప్పదనం కాదది. ఆయన దగ్గర నుండి వస్తున్నాయి ఆ అలలు! అదంతా బాబు దివ్య శక్తి! గురుశక్తి!

బయట ప్రపంచంలో తెల్లవారి లేస్తే మళ్ళీ సాయంత్రానికి ఇంటికి వచ్చి చేరుతామో లేదో తెలియదు. సర్వ ప్రపంచమంతా అల్లకల్లోలంగా ఉంది. కాని మనకో? ఈ ప్రశాంతత! ఈ ఆనందం! ఇది గురుశక్తి! గురుమూర్తి కూటస్థ చైతన్య పరబ్రహ్మంగా వెలుగొందుతున్నారు ఇక్కడ. అయితే గురుశక్తి ఈ ఆశ్రమం మటుకే వ్యాపించి ఉందా? అని మీరు అడగవచ్చు. కాదు! గురుశక్తి అఖండం, అనంతమైనది. సర్వత్రా వ్యాపించి ఉంది. పాలు ఆవు యొక్క దేహమంతా వ్యాపించి ఉన్నాయి. కాని పొదుగు దగ్గర పట్టుకుని పితికితేనే కదా అవి మనకి లభించేవి!

సర్వత్రా వ్యాప్తమైయున్న గురుశక్తి ఇక్కడ కూటస్థ చైతన్య పరబ్రహ్మంగా నిక్షిప్తమై యున్నది. కనుకనే ఈ స్థలమంతా ఇంత తేజోవంతంగా, శక్తివంతంగా ప్రకాశిస్తోంది.

మహాత్ముల శల్యాల మీద నీడ పడినంతనే చిత్రరథుడనే గంధర్వుడు తన విమానం కూలి క్రిందపడినట్లుగా 'శ్రీమన్నారాయణ కవచం' మనకి చెబుతోంది.

సీ॥ అతిభక్తి గౌశికుండను బ్రాహ్మణుడు దొల్లి
ఈ విద్య ధరియించి యెలమి మించి
మరుభూమి యందు నిర్మల చిత్తుడై యోగ

ధారణంబున బిట్టు తనువు విడిచె
దానిపై నొకడు గంధర్వ వరేణ్యుండు
చిత్రరథా ఖ్యుడజేయు డొంటి
జదల జనంగ; తచ్ఛాయ తదస్థిపై,
గదిసిన నాతడు గళవళించి

ఆ॥ యువిదపిండుతోడ నవ విమానముతోడ
దనదు విద్యతోడ ధరణి ద్రెళ్ళి
తివిచి లేవలేక తికమక గుడువంగ
వాలఖిల్య మౌని వాని చూచి।

క॥ నారాయణ కవచ సమా
ధారణ పుణ్యాస్థి దీని దగ్గర నీకుం
గూరెడినె? విష్ణు భక్తుల
వారక చేరంగ నెట్టి వారికి దరమే?

మరి బ్రహ్మజ్ఞానులైన గురుమూర్తి శక్తి నిర్ణయింప యెవరి వశము? బాబు మనని దేనినీ వదలమని చెప్పలేదు. ముక్కు మూసుకుని కూర్చోమని చెప్పలేదు. దారాపుత్రాదులను చూసుకోమన్నారు. స్వధర్మాన్ని ఆచరించమన్నారు. మనలోని కామగ్రోధాది గుణాలని, రాగ ద్వేషాలని, అహంకార, మమకారములని విడిచిపెట్టమన్నారు. అన్నీ చూసుకుంటూ భగవంతుడు అనేవాడు ఒకడున్నాడని విశ్వసించ మన్నారు. మనందరితో ఉండేది 'బాబు' అనే రెండు అక్షరాలే. 'బాబు'లో ఎటువంటి తలచిక్కు బేరాలూ లేవు.

ఇక్కడ మన ఆశ్రమంలో ఇన్ని కార్యక్రమాలు ఎలా జరుప బడుతున్నాయి? ఎందుకు జరుపబడుతున్నాయి? 'బాబు' అనే రెండు అక్షరాల శక్తి వలన మాత్రమే జరుగుతున్నాయి! ఆయన రెండు వేళలా ప్రార్థన చేసుకోమన్నారు. 'మంత్రమూలం గురోర్వాక్యం' అది తు.చ. తప్పక పాటించిననాడు ఆనందం మన సొత్తు!

- సశేషం

## సన్నిధిలో సంభాషణ

- పరాశర ప్రసాద్

24-12-1985

శ్రీబాబు భక్తులనుద్దేశించి మాట్లాడుతూ "పరమాత్ముడు దయానిధి, కరుణాసాగరుడు, ఆపద్బాంధవుడు, అనాధ రక్షకుడు. ఆయన ప్రేమ అంతులేనటువంటిది. సర్వజీవులను ఉద్ధరించి తనలో చేర్చుకోవాలనే ఆవేదన, తపన కలిగి ఉంటాడు. అందుచేతనే జీవుడు తన స్థితిని గుర్తించేలాగా నిరంతరము తన దేహంలో 'సోఽహం, సోఽహం' అని అజప గాయత్రి జరుగుతూ ఉంటుంది. ఇది తల్లి గర్భం అనే నరకంలో ఉన్నప్పటి నుండి హెచ్చరిస్తూనే ఉంటుంది. 'నీవు ఈ దేహం కాదు, ఇంద్రియాలు కాదు' వీటన్నిటిని ప్రకాశింపచేసే ఆత్మవస్తువే నీవు. దానిని గుర్తించు' అని హెచ్చరిక చేస్తూనే ఉంటుంది. అయితే మానవుడు అజ్ఞానం వలన దీనిని గుర్తించలేడు.



అవివేకంతో 'ఈ దేహం నాది. ఈ శరీరం నేను' అనే భ్రమలో పడతాడు. అదే జీవత్వము అంటే. జీవత్వం వలన కామక్రోధాది గుణాలు, ఈర్ష్య ఆసూయ, రాగద్వేషాలు, సత్త్వ రజ స్తమోగుణాలు, దారేషణ, పుత్రేషణ, ధనేషణ చెలరేగుతాయి. జీవుడు తన మనస్సుని ఆ శివుని యందు నిలిపితే తాను హంస అయి సోఽహం భావనను గుర్తిస్తాడు.

అండాండము అంటే లోపల, బ్రహ్మాండము అంటే బయట. అంటే సర్వత్రా ఆ శివ స్వరూపాన్ని దర్శిస్తాడు. కాని జీవత్వము అలా చేయనిస్తుందా? ఎంత డాక్టరు అయితే మాత్రం, పోనీ లెక్చరరు అయితే మాత్రం M.A డిగ్రీ M.Com డిగ్రీలు, గొర్రె పొటేలు మీసాలు, మేము క్షత్రియులం అనే భావన, స్వస్వరూపాన్ని దర్శింపజేయనిస్తాయా? ఒకవేళ నాబోటివాడు వచ్చి 'ఈ దేహం నీవు కాదురా దేహాన్ని, ఇంద్రియాలను ప్రకాశింపజేసే వస్తువు ఒకటి నీలో ఉందిరా' అని చెపితే మాత్రం నమ్ముతారా? 'బాబుగారు కోతలు కోసేస్తున్నారు' అంటారు. ఈ డిగ్రీలు చదివిన వాళ్ళు అంతా కలసి 'ఏమిటీ బాబుగారు న్యూసెన్స్‌గా (కరెక్టేనా)

లేక నాన్సెన్స్‌గా ఇలా మాట్లాడుతున్నారు' అంటారు. మీరు చదివిన డిగ్రీలు, గొర్రెపొటేలు మీసాలు మీలోని ఆరు గుణాలను జయించనిస్తాయా?

ఇది ఎలా ఉంటుందంటే విరోచనాలకి ఒక tablet వేసుకుంటే చెమట పట్టి తల తిరగటం మొదలు అయి దడ ఎక్కువయి డాక్టరుని పిలిచారట. డాక్టరు వచ్చి 'ఇది చాలా ప్రమాదం. దీనికి నాదగ్గర ఫారిన్ మందు ఉంది' అని అంటాడు. డాక్టరు సంచి ఘల్లుమంటుంది. పేషంటు ఇంట్లో అంతా గొల్లుమంటారు. ఇది అంతా ఎలా జరిగింది? చెప్పండి కోరి తెచ్చుకున్నదే కదా? జీవత్వం కూడా అలానే సంకటములకు గురిచేస్తుంది.

ఇక్కడ కూర్చున్నారు చూడండి ఆడిటర్ గారు, ఈయనకి చిన్నతనంలో చెప్పాను. నీ నల్లని వెంట్రుకలో తెల్లని వస్తువు ఉంది, అని. ఆయన దానిని నమ్మాడా? ఇప్పుడు మాత్రం ఎవరైనా క్లయింట్స్ ఇస్తే వేసుకుందాం, ఖర్చు ఎక్కువైపోయింది, పెళ్ళి చేయాల్సిన పిల్ల ఉంది, డబ్బు సంపాదించి ఇయ్యవలసిన కొడుకు ఉన్నాడు, అని ఆ మధ్య రంగు వేయటం మానేశాడు. అయినా ఇందులో ఇంకొక రహస్యం కూడ ఉంది. 'ఈ రంగులు వేసి నన్ను మోసం చేయలేరు కదా? ఎందుకండి వెయ్యకండి' అని ఈయన భార్య అనటం వలన కూడా మాని ఉండవచ్చు.

"నువ్వా ఉన్నావు ఎందుకయ్యా వెంకటరత్నం! పాపం నువ్వు ఎప్పుడైనా రంగు వేశావా?" అని అడిగారు శ్రీబాబు. 'వెయ్యటానికి వెంట్రుకలు ఉండాలి కదా బాబూ!' అన్నారు రత్నంగారు. శ్రీబాబు మాట్లాడుతూ "ఉంటే వేసేవాడివన్నమాట. మెరుపు మెరిస్తే చీకటి ఉంటుందా? అలాగే జ్ఞానం వస్తే ఈ రంగులు ఎందుకండీ? ఈ ప్రపంచం అంతా ఒక రంగుల కల. ఇది అసత్యమని తెలుసుకో.

అంత ఎందుకూ, నీలో నలుగురు పురుషులు ఉన్నారు. శైశవంలో ఉన్నవాడు వేరు, కౌమారంలో ఉన్నవాడు వేరు, యౌవనంలో ఉన్నవాడిలో ఇంకా మార్పు వస్తుంది. నాలుగవ పురుషుడు వార్ధక్యంలో ఉంటాడు. 18 లేక 25 సంవత్సరాల వయస్సులో ఉన్న బలము వెంట్రుకలు తెల్లబడిన తర్వాత ఉంటుందాండి రాఘవాచార్యులుగారూ మనలో

మనమాట?" అని అడిగారు.  హెడ్‌మాష్టారు గారు మాట్లాడుతూ 'ఉండదండి' అన్నారు.

శ్రీబాబు మాట్లాడుతూ "అయితే మీరు పుట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు దేహస్థితిలో మార్పు వచ్చింది గాని మార్పులేనిది, పరిణామము చెందనిది ఒక వస్తువు ఉంది. దానిని గుర్తించండి చాలు. అదే ఆత్మవస్తువు. దానికి చావు పుట్టుకలు లేవు. అది వర్షానికి తడవదు. ఎండకి ఎండదు. పరిణామాలు లేనిది. నువ్వు పుట్టినప్పటి నుండి హెచ్చరిక చేస్తున్నా లక్ష్యపెట్టలేదనుకో. కనీసం పరమ దయాళువు అయిన ఆ పరమాత్ముడు

అప్రత్యక్షో మహాదేవః సర్వేషాం ఆత్మ మాయయా

ప్రత్యక్షో గురు రూపేణ వర్తతే భక్తి సిద్ధయే

అన్నట్లుగా గురురూపంలో వచ్చి నీ స్థితిని నీకు తెలియజేసి నీకు అన్నీ సిద్ధింపజేస్తాను అంటే ఎంతమంది గుర్తిస్తున్నారండీ?" అని ప్రశ్నించారు.

# యోగవాశిష్ఠము

- సుషుమ్నా ప్రసాద

అప్పుడు సంబార తనలో తాను యిలా అనుకొన్నాడు "దేవతలను నశింప చేయటానికి నాచే సృజింపబడ్డ దమ, వ్యాల, కటయనే యీ అసురులు వారి గర్వము, అవివేకము, అహంకారము వలన యుద్ధములో పరాజయము పొందారు. వారు ఆత్మ జ్ఞానశూన్యులు, వారిలో 'నేను', 'నాది' యనే భావము ధృడముగ పేరుకుపోయి, పతనమునకు దారి తీసింది. నేను మరల నా మాయా శక్తితో ఆత్మజ్ఞాన సంపన్నులయి, ఆధ్యాత్మిక శాస్త్రములలో, నిష్ణాతులై, మాయా జనితమైన అహంకారము నుండి విముక్తులైన, అసురులను సృష్టిస్తాను. వారు దేవతలను సంగ్రామములో, సునాయా సముగా ఓడించగలరు.



అలా నిశ్చయించుకొని, సంబార తన మాయా శక్తితో ముగ్గురు అసురులను సృజించాడు, వారు సముద్రపు వుపరితలముపై తేలే బుడగల్లా, యీ అసురు లాకాశమునంతా, ఆక్రమించారు వారాత్మజ్ఞాన సంపన్నులై, సర్వమూ తెలిసినవారు. వారు ప్రశాంతమైన మనసుతో పాపరహితులు, కామరహితులు. వారు సుగుణ సంపన్నులై, రాగ ద్వేషములు, సందేహములు, భయము, అహంకారము, నేను, నాది యనే భావముల నుండి విముక్తులు. ఈ విశాల విశ్వమంటే వారికి తృణ ప్రాయము, వారు భీమ, భాస, ధ్రిధ యనే పేర్లతో తెలియ బడ్డారు.

సంబార వారిని దేవతలతో యుద్ధము చేయుమని, ఆజ్ఞాపించాడు, అనేక సంవత్సరములు వారు దేవతలతో యుద్ధము చేశారు. కాని వారు గర్వముతో, విర్రవీగలేదు, వారు నిర్భయంగా దేవతలతో యుద్ధము చేశారు. వారు 'దేహ'ము నేను కాదని యీ శరీరానికి స్వయం ఉనికిలేదని ప్రగాఢ విశ్వాసము, వారికి భూత, భవిష్యత్తులను గురించిన ఆలోచనలు లేవు. మృత్యువును గురించి భయములేదు, వారి మనసులు నిర్వికారము, అనుబంధ రహితము, అందుచేత వారు తాము నిర్జించే వారమనే భావన లేకుండా,

శత్రువులను నిర్జించారు. వారికెలాంటి కోరికలులేవు, కర్తృత్వ భావములేదు, వారు కేవలము తమ గురువైన సంబారుని పట్ల తమ కర్తవ్యమును నెరవేరుస్తామన్న దృష్టితో యుద్ధము చేశారు. వారు అనుబంధము, ప్రేమ యనే భావములనుండి విముక్తులు, ఎవరైతే అహంకార రహితులై, ఆత్మ విచారణ చేస్తారో, జనన, మరణ భయము వారికి సుదూరము. వారు సునాయాసంగా లభించిన వాటితో, సంతృప్తి చెందేవారు.

"దేవతలు యుద్ధ భూమి నుండి పారిపోయి, శ్రీహరి శరణు జొచ్చి, వారి పాదారవిందములపై సాగిలపడ్డారు, దేవతల మొరాలకించి, శ్రీహరి కదన రంగమునకు వచ్చి, ఆ ముప్పురు, అసురులను నిర్జించి, వైకుంఠ దాసులను చేశారు. వారా విధంగా ప్రభువైన శ్రీహరి చేత నిర్జింపబడి, రక్షింపబడ్డారు. అత్యుత్తమమైన వైకుంఠ వాసుని సన్నిధి చేరుకొన్నారు.

వాసనలు బంధనకు దారితీస్తాయి. అలాంటి వాసనలను నిర్మూలిస్తే, బంధరహితులౌతారు. ఆత్మజ్ఞానమనే అగ్నిలో వాసనలు దహింప బడుతాయి. తైలము లేని దీపమువలె, మనసు ప్రశాంతతను పొందగలుగుతుంది. విషయాలను గురించిన ఆలోచనలలో, వాని ప్రభావము మనస్సుపై ముద్రవేయటంతో, మనసుకు వునికి లభిస్తుంది. ఈ సంకల్పాలను సంపూర్తిగా నిర్మూలిస్తే, మనసు తృటిలో అదృశ్య మవుతుంది, మనసు వాసనా రహితమైతే, అదే ముక్తి. దమ, వ్యాల, కట యని మొదట సృజింపబడ్డ రాక్షసులు వారి యొక్క అహంకారముతో పరాజయము పొందారు. కాని అహంకార రహితులై నందువలన భీమ, భాస, ధ్రిధ యనే అసురులు, విజయాన్ని సాధించారు.

'ఓ రామా, పైన చెప్పబడిన కథ ద్వారా అహంకార రహితులైనవారు, విజయాన్ని సాధిస్తారని గ్రహిస్తారు. దమ, వ్యాల,కట యనే అసురుల మార్గాన్నెప్పడూ అనుసరించకూడదు. 'భీమ, భాస, ధ్రిధ యనుసరించిన మార్గములో పయనిస్తే, విజయము తథ్యము. కనుక కళంక రహితుడనైన 'ఓ రామా! నీ ఆత్మ జ్ఞాన సంపన్నుడవై, అన్ని విషయాలు గ్రహించి, పరమానంద స్వరూపమైన ఆత్మలో నిరంతరము శాంతిని పొందుదువుగాక".

- సశేషం

# శ్రీ కాళీ గార్డెన్స్ కార్యక్రమములు

ఫిబ్రవరి 2015

3 మంగళ : మాఘపూర్ణిమ, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

14 శని : శ్రీగురుదశమి, సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ

17 మంగళ : మహా శివరాత్రి - తె॥జా 3గం.లకు బృందావనంలో శ్రీగురుదేవులకు నమకచమక సహిత అభిషేకం; 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ; అనంతరం శ్రీరామలింగేశ్వర స్వామికి సామూహిక ఏకాదశ రుద్రాభిషేకాలు; 11గం.లకు శ్రీరామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకం; లక్షబిల్వార్చన; భక్తసమారాధన. సాయంత్రం 6-30ని॥లకు శ్రీ ఉమారామలింగేశ్వర స్వామివారి నగరోత్సవం. అనంతరం సామూహిక కళ్యాణ మహోత్సవం.

18 బుధ : అమావాస్య

21 శని : శ్రీలలితానంద సరస్వతీ స్వామినివారి ఆరాధనమహోత్సవం సత్సంగం, శ్రీ సద్గురుపాదపూజ

మార్చి 2015

5 గురు : ఫాల్గుణ పూర్ణిమ; హోలీ - శ్రీసద్గురుపాదపూజ

15 ఆది : శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ

18 బుధ : మాస శివరాత్రి. పావులూరు బ్రాంచిలో ఏకాహం.

20 శుక్ర : అమావాస్య

21 శని : శ్రీ మన్మథ నామ సంవత్సరాది - ఉదయం 11గం.లకు పంచాంగ శ్రవణం; శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

21శని నుండి 27 శుక్ర : వరకు మౌనధ్యాన సప్తాహం

28 శని : శ్రీరామ నవమి; ఉదయం 5-30ని॥లకు శ్రీసద్గురుపాదపూజ, 11గం.లకు శ్రీసీతారాముల సామూహిక కళ్యాణాలు, భక్తసమారాధన.

# పరి ప్రశ్నేన సేవయా

- పరాశర ప్రసాద్

'భగవానుడు సర్వవ్యాపకుడు. ఆయనను సర్వత్రా దర్శించవచ్చు కదా! ఆయనను దర్శించటానికి వేరొకరి సహాయం అవసరమా?' అన్న ప్రశ్నకు సమాధానంగా శ్రీసద్గురుదేవులు మాట్లాడుతూ....

"వేరొకరు అని మీరు ప్రస్థావించినది సద్గురుమూర్తి అవసరం ఏముంది? అనే కదా! గాలి సర్వవ్యాపకమైనదే కదా! మన చుట్టూ



వ్యాప్తమై ఉన్నది. కాని గాలి కోసం ఫ్యాన్‌లు ఎందుకు వాడుతున్నామో చెప్ప గలరా? ఫ్యాన్ గాలిని ఉత్పత్తి చేస్తోందా? లేక ఆ ప్రదేశంలో వున్న గాలిని మనకు అందుబాటులోకి తెస్తోందా? ఆ విషయం అలా ఉంచండి. వ్యాధిగ్రస్థులైన వారికి ప్రత్యేకంగా వేరొక పరికరం ద్వారా ఆక్సిజన్ అందించవలసిన అవసరం ఏముంది? మన చుట్టూ ఆవరించి ఉన్న గాలి ఉంది కదా! అంత ఎందుకండీ! మీరు చదువుకున్నవారు. మీకు ఎవరి సహాయం లేకుండానే గ్రంథాలను స్వయంగా అధ్యయనం చేసి విద్యావంతులు అయ్యారా? ప్రాపంచిక విద్యను అభ్యసించటానికే గురువు కావాలి కదా! మరి సర్వ సృష్టికి కారకుడు సమస్త జగత్తు ఆధారమూర్తి అయిన ఆ భగవంతుని గుర్తించే మార్గాన్ని శోధించి తమ జీవితాలను త్యాగం చేసిన ఫలితాన్ని సాధించినవారి సహాయ సహకారాలు లేకుండా భగవంతుని గుర్తించ గలిగినవారు ఎవరైనా ఉన్నారా? సర్వవ్యాపకుడైన భగవానుని గుర్తించటానికి ఒక గైడ్ కావాలి. ఆ గైడ్ ఎవరు? ఆయనే సద్గురు మూర్తి. సాక్షాత్తు ఈశ్వరుడే మానవ ఆకారంలో రూపధారణ చేసి, మానవులని ఉద్ధరించటానికి అవతరించి వచ్చారు. మానవులు మానవాకారంలో వస్తేనే గుర్తించగలుగుతారు. అంతేకాదు వారు సూచించే మార్గదర్శక సూత్రాలు అందుకో గలుగుతారు. మేఘావృతమైన ఆకాశంలో సూర్యభగవానుడు గోచరించనట్లు గుణసహితుడైన మానవుడు మాయకి లోబడి తన చెంతనే ఉన్న భగవానుని గుర్తించలేక పోతున్నాడు. మాయని రహితం చేయగల శక్తి సద్గురుమూర్తికే సాధ్యంగాని, మానవులు సాధించ గల్గుతారా? సద్గురు సమాశ్రయం లభించని సాధకులకి భగవద్దర్శనం దుస్సాధ్యం సుమా!" అన్నారు శ్రీబాబు.

(గత సంచిక తరువాయి) **సద్గురు శ్రీ యాత్రా దర్శన్** -పి. సుధారాణి

జ్వాలాదేవి అఖండ తేజస్సుతో ప్రత్యక్షమై అతడి శిరస్సును యథా స్థానంలో ఉంచి ప్రాణదానం చేస్తుంది. 'నీవు ఏ విధంగాను రాజు ముందు తల వంచవలసిన పనిలేదు. వెళ్ళి నీ గుఱ్ఱాన్ని సజీవంగా చూడు' అని దీవిస్తుంది. అతడు అమ్మను ఒక కోరికను కోరతాడు. 'తల్లీ! జగదీశ్వరీ! అమాయకులైన భక్తులు నిన్ను సరైన పద్ధతిలో అర్చించుకోలేక పోవచ్చు. వారికి పరీక్షలు పెట్టకమ్మా! నా వలె శిరస్సును ఖండిచుకుని వారి భక్తిని నిరూపించుకోలేరు. దయచేసి వారి ప్రార్థనలను స్వీకరించి, వారిని కనికరించు' అని. అప్పటి నుండి తల బదులు కొబ్బరికాయను, స్వచ్ఛమైన భక్తిని స్వీకరిస్తాను అని అమ్మ అంగీకరించింది.

ఢిల్లీలో గుఱ్ఱపు తల అతుక్కుని గుఱ్ఱం సజీవమయింది. అక్బర్ ఆశ్చర్యచకితుడై సైనికులను జ్వాలాదేవి వద్దకు పంపుతాడు. వారు భూమిలో నుండి జ్వాలగా వెలిగే అమ్మవారిని గురించి చెప్తారు. రాజు ఆ జ్వాలను ఏ విధంగానైనా సరే ఆర్పివేయమని ఆదేశిస్తాడు. సైనికులు రకరకాలుగా ప్రయత్నిస్తారు. ఇనుపమూకుళ్ళతో మూయడానికి ప్రయత్నిస్తారు. నీళ్ళు పోస్తారు. వారి ప్రయత్నాలన్నీ విఫలమయి పోతాయి. అక్బర్ పశ్చాత్తాపపడి, పండితుల సలహా మేరకు అమ్మవారిని ప్రసన్నం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు.

బంగారు గొడుగు తీసుకువెళ్ళి అమ్మవారి తలపై పెట్టగా, ఆ గొడుగు క్రిందపడి విరుగుతుంది. ఆ బంగారము ఒకే విధంగా పేరు తెలియని లోహంగా మారుతుంది. అక్బర్, దేవి తనమీద ఆగ్రహించిందని తెలుసుకుని, అనేక విధాలుగా ప్రార్థించి, అర్చించి వేడుకుంటాడు. తన సైనికులతో ఇకపై అమ్మ భక్తులను గౌరవించమని ఆదేశిస్తాడు. ఆ గొడుగు ఇప్పటికీ ఆలయ ప్రాంగణంలో ఉన్నది. జ్వాలాదేవిని పంచ దశ మరియు షోడశ ఉపచారాలతో సేవిస్తారు. రోజుకు ఐదుసార్లు నైవేద్యాలు, హారతులు ఇస్తారు.

- సశేషం

# ఏమని ప్రార్థింపనూ మా గురుదేవుని?

- పెనుమాక నాగేశ్వరరావు

కలనైనా మీ స్మరణే, కలవరమందైన మీ స్మరణే
మధుర మనోహర మనోరథ సారథి మీరే
ఇహ పరాలకు సరియగు వారధి మీరే
దయానిధి మీరే, దయా శరథి....దాశరథి మీరే ।కలనైనా।

సిరులూ సంపాదలూ మీ కరుణేగా
సుఖమూ శాంతియు మీ చలువేగా
నామ స్మరణయే ధన్యోపాయము గాదా
మీ స్మరణే మందార మకరందము కాదా కలనైనా ।కలనైనా।

విలాసమూ విలాపమూ మీ లీలయే కాదా
మోదము, ఖేదమూ మీ క్రీడయే కదా
రాగమూ, మోహమూ మీ మాయయే కాదా
కలిమియు లేమియు మీ కానుకె కాదా కలనైనా ।కలనైనా।



# తెలివైన రాజు

- రావి శోభ

పూర్వకాలంలో ఒక రాజ్యంలో రాజవంశంలో వారసులెవరూ లేకపోతే పట్టపుటేనుగుకి పూలహారం ఇచ్చి అది ఎవరి మెడలో వేస్తే వారిని రాజుగా ఎన్నుకునేవారు. అయితే జీవితాంతం కాక, ఒక 20సంవత్సరాలు పరిపాలించాక అతనిని అడవులకు పంపివేసేవారు. అది వారి ఆచారము.

అలా జరుగుతుండగా ఒక పర్యాయం 10సం॥ల వయస్సుగల బాలుడి మెడలో ఏనుగు పూలహారం వేసింది. అందరూ 'అయ్యో పాపం! ముక్కు పచ్చలారని పసివాడే 20 సం॥లు నిండిన తరువాత ఇతడు కూడా అడవులపాలు అవవలసినదే కదా!' అని ఎంతో విచారించారు.

అపారమైన తెలివితేటలు కలిగిన ఆ బాలుడు రాజ్యాన్ని ప్రజా రంజకంగా పాలించాడు. 20 సం॥లు ఇట్టే గడిచిపోయాయి. ఆ బాలుడు ఇప్పుడు 30సం॥లు కలిగిన యువకుడు అయ్యాడు. ప్రజలంతా 'ఇతని పాలనలో ఎన్నో సుఖభోగాలు అనుభవించాము. ఇంత మంచి యువకుడు ఇప్పుడు అడవులపాలు అవ్వాలి కదా!' అని ఎంతో బాధ పడ్డారు. అయితే ఆ యువకుడి ముఖములో ఏవిధమైన విషాదము లేక ఎంతో నిశ్చింతగా ఉన్నాడు.

నియమం ప్రకారం దారిలో నదిని పడవలో దాటించి ఆ వ్యక్తిని అడవులలో దింపేశారు. అప్పుడు కూడా ఆ రాజు ముఖములో ఎట్టి మార్పు రాలేదు. సరియైన చోటుకు వచ్చాక పడవవాళ్ళు పడవలో నుంచి దించేస్తూ బాధపడ్డారు. ఆ రాజు పడవ దిగి నడుచుకుంటూ అడవుల లోనికి ఒంటరిగా వెళ్ళిపోయాడు.

ఎదురుగా అందాల రాజబాటలు, మనోహరమైన తోటలు, ఆపైన సుఖ భోగాలతో విలసిల్లే రాజ అంతఃపురం కనిపించాయి. అంటే ఇతను రాజుగా 20సం॥లు పాలించిన సమయంలోనే, నేర్పుగా భవిష్యత్తులో తను వెళ్ళవలసిన అడవిలో చక్కని సౌకర్యాలు ఏర్పరచుకుని, రాజు ఆ భవనంలో సుఖంగా నివసించడానికి వెళ్ళాడు. అదీ తెలివి అంటే! అదీ ముందుచూపు అంటే!!

# గీతాధ్యయనమ్

- రమణ ప్రసాద్

పంచమ వేదంగా ప్రసిద్ధిగాంచిన మహాభారతంలో ఏ విధంగా ధర్మస్థాపన జరిగిందో తెలుస్తుంది. కురుక్షేత్రంలో 'గీతాగంగ' ప్రవహించింది. ఇంకా భీష్ముడు అంపశయ్యమీద ఉన్నప్పుడు 'విష్ణుగంగ' ప్రవహించింది. ధర్మాన్ని రక్షిస్తే ధర్మం మనని రక్షిస్తుంది. 'ధర్మో రక్షతి రక్షితః' అని ఈ గ్రంథం తెలిపింది.



ధృతరాష్ట్రుడు 'సంజయా! ధర్మానికి నిలయమైన కురుక్షేత్రంలో యుద్ధ సన్నద్ధులైన నా వాళ్ళూ, పాండవులు ఏం చేశారు?' అని అడిగాడు.

సంజయుడు "దుర్యోధనుడు ద్రోణాచార్యుని వద్దకు వెళ్ళి ఆచార్యా! దృష్టద్యుమ్నుడు వ్యూహం పన్నిన పాండవ సైన్యాన్ని చూడండి. వారిలో సాత్యకి, విరాటుడు, దృపదుడు, దృష్టకేతువు, చేకితానుడు, కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుడు, యుధామన్యుడు, ఉత్తమౌజుడు, అభిమన్యుడు, ఉపపాండవులు ఉన్నారు. వీరంతా మహా రథులు. బ్రాహ్మణోత్తమా! మన సైన్యంలో మీరు, భీష్ముడు, కర్ణుడు, కృపాచార్యుడు, అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుడు ఇంకా ఎంతోమంది శూరులు నాకోసం ప్రాణాలను అర్పించటానికి సిద్ధంగా ఉన్నారు. భీష్ముడు రక్షిస్తున్న మన సైన్యం అపరిమితం. పాండవుల సైన్యం పరిమితం" అన్నాడు.

దుర్యోధనుడికి సంతోషాన్ని కలిగిస్తూ భీష్ముడు సింహనాదం చేసి శంఖం పూరించాడు. కౌరవ సేనలు శంఖాలు పూరించారు. పాండవుల వైపున శ్రీకృష్ణార్జునులు పాంచజన్యాన్ని, దేవదత్తాన్ని పూరించారు. భీముడు పౌండ్రకాన్ని, ధర్మరాజు అనంతవిజయాన్ని, నకుల సహదేవులు సుఘోష మణిపుష్పకాలను పూరించారు.

అప్పుడు అర్జునుడు శ్రీకృష్ణుని ఉభయ సేనల మధ్య రథాన్ని నిలపమని ఆదేశించాడు. అర్జునుడు ఉభయసేనలలో ఉన్న పెద తండ్రులను, పిన తండ్రులను పౌత్రులను, మిత్రులను మొదలగు

ఆత్మీయులను చూసి విషాదవశుడై 'కృష్ణా! నా అవయవాలు తడబడుతున్నాయి. గాండీవం జారిపోతోంది. నా మనస్సు తల్లడిల్లి పోతోంది. దుశ్శకునాలు కానవస్తున్నాయి" అంటూ

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖానిచ ।
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితే న వా ॥ (1/32)

"కృష్ణా! నాకు యుద్ధంలో విజయం మీదగాని, రాజ్యసుఖాలమీద గాని ఆసక్తి లేదు. ఈ రాజ్యం వలన గాని, ఈ భోగాల వలనగాని, ఈ జీవితం వలనగాని ఏమి ప్రయోజనము."

"జనార్ధనా! ఈ ధార్తరాష్ట్రులను చంపి మనం బావుకునేది ఏం ఉంది?" అంటూ ధనుర్బాణాలను త్యజించి రథంలో కూలబడిన అర్జునుని చూసిన శ్రీకృష్ణుడు .....

కుతస్త్వా కశ్మల మిదం విషమే సముపస్థితిమ్ ।
అనార్యజుష్టమస్వర్గ్యమ్ అకీర్తికరమర్జున ॥ (2/2)

"ఈ క్లిష్ట సమయంలో ధర్మ విరుద్ధమూ, అపకీర్తిదాయకమూ, నరక ప్రాప్తి హేతువూ అయిన ఈ మోహము నీకు ఎలా దాపురించినది? మనో దౌర్బల్యాన్ని విడిచి యుద్ధానికి సిద్ధం కా!"

అర్జునుడు "ఓ మధుసూదనా! పూజ్యులైన భీష్మద్రోణాదులతో ఎలా పోరాడగలను? వీరిని హతమార్చేకంటె భిక్షమెత్తుకుని జీవించటం నాకు సమ్మతమే. కృష్ణా! కార్పణ్యదోషం (పిరికితనం) వలన నా స్వభావాన్ని కోల్పోయాను. ధర్మాధర్మ విచక్షణ చేయలేకపోతున్నాను. నేను నిన్ను శరణు వేడుతున్నాను. నాకు ఏది శ్రేయస్కరమో ఉపదేశించు" అన్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు పరిహాసంగా....

అశోచ్యా నన్వశోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే ।
గతా సూనగతాసూంశ్చ నాను శోచన్తి పండితాః ॥ (2/11)

"అర్జునా! శోకింపని వారికొరకై శోకిస్తున్నావు. పైగా ప్రజ్ఞావంతునిగా మాట్లాడుతున్నావు. కాని పండితులు (జ్ఞానులు) ప్రాణములు పోయిన వారిని గురించిగాని, ప్రాణములు పోనివారిని గురించిగాని శోకింపరు"

- సశేషం

# శ్రీకృష్ణ కర్ణామృతము

- సుశీలా ప్రసాద

నా మిత్రులంతా రాక్షసులే! కావటాన నాకు చెడు గుణాలన్నీ నేర్పారు. పెద్దయ్యాక నన్ను వాళ్ళు కంసరాజు దగ్గరకు తీసుకువెళ్ళారు. కంసరాజుకి నన్ను చూపించి 'వీడు కూడా మీకు పనికివస్తాడు మారాజా' అన్నారు. వెంటనే నేను 'మీరు చెప్పిన పని తప్పకచేస్తాను మారాజా' అన్నాను. 'ఇంకేం! ఎంతమందైనా అవసరం నాకు ఈ సమయంలో నా విరోధియైన ఆ పసివాడిని మట్టు పెట్టటానికి. ఇంతకుముందు నలుగురైదుగురిని పంపించాను. వాళ్ళజాడ లేదు ఇప్పటిదాకా. ఏమైందో తెలియదు' అన్నాడు కంసుడు విచారంగా.



నాకు భయం వేసింది. నేనేమైపోతానో అని బెరుకు పుట్టింది. అయినా సరే రాజుకి మాట ఇచ్చాను. మాటమీద నిలబడాలి అనుకున్నాను. ప్రాణాలు పోయినా సరే మాటమీద నిలబడాలనుకున్నాను.

"ఆ త్యాగమే నిన్ను రక్షిస్తోంది" అన్నాడు కన్నయ్య. "సరే చెప్పు అందుకే నన్ను వెతుక్కుంటూ వచ్చావు ఇక్కడికి అవునా? మరి నన్ను ఎలాగ గుర్తుపట్టావు?" అని అడిగాడు కన్నయ్య.

'చుక్కల్లో చంద్రుడిలా వెలిగిపోతున్న నీ రూపాన్ని చూడగానే కంసరాజు వెతుకుతున్న పసివాడవు నీవే అని అనుకున్నాను' అన్నాడు మయూరుడు.

"నన్ను పట్టుకుని ఎత్తుకుని పారిపోదామనుకున్నావు కదరా? అప్పుడేమైంది? నిన్ను పాము కరచి చచ్చిపోయి నరకానికి వెళ్ళావు. అక్కడ ఏం జరిగిందో చెప్పు" అన్నాడు కన్నయ్య.

"అక్కడ యమ కింకరులు నా పాపాలన్నింటికి తలోరకం శిక్ష వేస్తుంటే బాధలు భరించలేక కేకలు పెడుతుంటే, 'నువ్వు చేసిన మంచి పని ఏమైనా ఉంటే చెప్పు నీ శిక్ష తగ్గిస్తాము' అన్నారు కింకరులు. అప్పుడు వాళ్ళు నా అరికాలులో కాలిన సూదులు గ్రుచ్చబోతున్నారు. సరిగా అదే సమయంలో నాకు ముల్లు గుచ్చుకున్న నీ కాలు నేను పట్టుకోవటం జ్ఞాపకం వచ్చింది. ఆ మాటే వాళ్ళకు చెప్పాను. నీ కాలికి కట్టు కట్టిన

సంగతి కూడా వారితో చెప్పాను. 'దానికి ఋజువేది?' అని అడిగారు. అప్పుడే ఈ చిత్రం జరిగింది. కన్నయ్య అక్కడికి వచ్చాడు. నా ఎదురుగా నిలబడి 'నేను సాక్ష్యం చెబుతున్నాను. వీడిని వదిలేయండి' అని నన్ను చెయ్యి పట్టుకుని ఇక్కడకు తీసుకువచ్చాడు కన్నయ్య" అన్నాడు మయూరుడు.

"కన్నయ్య ఇక్కడే ఉన్నాడు కదరా! మరి అక్కడకి ఎలా వచ్చాడు?" అన్నారు ఆ పిల్లలంతా కలసి. బలరాముడు అంతా వింటూ ఉన్నాడు. ఇప్పుడు అర్థం అవుతోంది తనకు "తమ్ముడు ఎందుకు ఈ రోజు తనను ఇక్కడకు రమ్మనమన్నాడో! ఇదంతా వాడి లీల! ఎంత దివ్యంగా ఉంది! వినడానికి చూడటానికి కూడా" అనుకున్నాడు మనస్సులో బలరాముడు.

మయూరుడు కన్నయ్య చెయ్యి పట్టుకుని "ఇంకెప్పుడూ నన్ను విడిచిపెట్టకు కన్నయ్యా!" అంటూ ఏడ్చేశాడు. "నిన్ను తీసుకురాకపోతే నా తల కోస్తానన్నాడు ఆ కంసుడు. నేను వాడి దగ్గరకు వెళ్లను. నన్ను పంపకు" అన్నాడు మయూరుడు. "ఎందుకు పంపిస్తాను? నువ్వు నా వాడివి అయిపోయావు కదరా మయూరా!" అన్నాడు కృష్ణుడు. తరువాత గోపబాలురందరినీ గోవులను తోలుకు రమ్మనమని చెప్పి వారితోపాటు మయూరుడిని కూడా పంపాడు కన్నయ్య.

ఇదే సమయమని తలచి బలరాముడు తన సందేహాన్ని బయట పెట్టాడు. "నీ పాదం పట్టాక ఇంకా వాడు ఎందుకు నరకానికి వెళ్ళాడురా తమ్ముడూ?" అని అడిగాడు.

"పూర్వజన్మలో వాడు చేసిన కర్మల ఫలితంగా రాక్షసజాతిలో పుట్టాడు. ఈ జన్మలో చేసిన పాపాలను అనుభవించటానికి నరకానికి వెళ్ళాడు. అయితే నా పాదం పట్టుకున్నందు వలన వాడిని నరకం నుండి కాపాడాను. ఇక్కడకి వచ్చేముందు కంసుడు వాడిని అక్రూరుడిని పిలచుకు రమ్మనమని పంపించాడు. సాధుజనుడైన అక్రూరుని దర్శనం వాడికి పుణ్యప్రదమైనది. నా పాద స్పర్శ వాడికి పాపనాశనమైనది. ఇదే పరమార్థ సారం కదా! అన్నయ్యా" అన్నాడు కన్నయ్య.

సాధూనాం దర్శనం పుణ్యం స్పర్శనం పాపనాశనమ్ ।
సంభాషణం కోటితీర్థ ఫలం వందనం మోక్షసాధనమ్ ॥

- సశేషం

## శ్రీ బాబు దివ్యవాణి

సేకరణ - మురళీ

(24-12-1976 శ్రీబాబు దివ్యబోధామృతం)

రాధ బృందావనంలో మాధవుని దేవదేవుడైన పరమాత్మగా, జీవుని రూపంలో ఆరాధించి తరించింది. బృందావనంలో క్రూర మృగములు ఏకమై ప్రేమ భావనతో మసలేవి.

గోప బాలురంతా మంచి స్నేహితులు. వాళ్ళ తల్లులు వాళ్ళకి ఏమి పెట్టినా తెచ్చుకుని ఒకచోట పెట్టుకుని తినేవారు. గోవిందుడు గోరక్షకుడు, దేవదేవుడిని హృదయంలో నిలుపుకుంటే ద్వైత భావం పోతుంది. గోవులన్నీ వేణునాదాన్ని విని మైమరచి మేయుట మాని, చూస్తూ వుండిపోయేవి. అటువంటి మహనీయుని అర్థం చేసుకోవటమే చాలా గొప్ప!



నేను కూర్చుంటే మీరందరూ కుర్చున్నట్లే, గోవిందుని వద్ద గోపబాలురంతా కూర్చునేవారు. ఆయన రావటం ఆలస్యమైతే నీరుకారి పోయేవారు కాదు. గోపాలురు గోవిందుని చుట్టూకూర్చుని చల్దులు ఆరగిస్తూ ఉండేవారు. ఆ స్వామి ఉచ్ఛిష్ట భోజనం భుజించి పునర్జన్మ లేనంతటి పుణ్యం ఆర్జించుకున్నారు. ఆయన స్పర్శ, ఆయనతో సలిపే సరససల్లాపాలు పైనుండి తిలకించి దేవతలు "అబ్బా! ఈ మానవులెంత అదృష్టవంతులు!" అనుకున్నారు. వారు కృష్ణపరమాత్ముని ధ్యానించి తరించారు.

వాళ్ళ దృష్టి ఏకదృష్టి. ఏ సంచలనానికి చలించేవారు కాదు. గోవిందుడు అందరికీ పెట్టాక తాను భుజించేవాడు. అన్ని రూపాల్లోను తానే ప్రకాశిస్తున్నాడు కదా! భగవంతుని అభయహస్తం క్రిందకి వచ్చిన జీవుడు తరించక మానడు. ఆ దివ్యనాధుని దివ్య చరణాలు సర్వదా రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## 'మరచినసూ మరపురారు!'

- ఎమ్. సుశీల

నేను, చందూ (మాతాజీ) 15సం॥ల వయస్సులో ఉండగా జరిగిన సంఘటన. బహుశ అది 1971 సం॥. మేమంతా గుంటూరులో పాండురంగ శ్రీశైల రావుగారింట్లో ఉన్నప్పటి సంగతి.

శ్రీబాబూజీ మహరాజ్ మూడు కార్లలో తిరుపతి వెళ్ళడానికి ఏర్పాట్లు జరిగాయి. అయితే నాకుగాని, చంద్ర (మాతాజీ)కిగాని, ప్రయాణానికి రమ్మన్న సంకేతాలు లేవు. మా ఇద్దరికి దుఃఖం వచ్చింది. నేను ఆలోచించి 'చందూ! మనమిద్దరము మన బ్యాగ్‌లు సర్దుకుని కిటికి దగ్గర నిల్చుని ఉందాం' అన్నాను. అలాగే రెడీ అయి కిటికీ దగ్గర కనుల వెంబడి నీరు కారుస్తూ శ్రీబాబూజీ మహరాజ్‌వారి రాకకోసం ఎదురు చూస్తూ నిలబడ్డాము.

ఇంతలో శ్రీబాబు పైనుంచి మెట్లు దిగి వచ్చి, మమ్మల్ని చూడకుండానే వెళ్ళి కారులో కూర్చున్నారు. ఆయనకి తెలియనిది ఏముంది? ఒకసారి మా వంక అక్కడి నుంచే పరికించి చూసి, "వాళ్ళిద్దరినీ రమ్మనమనండి" అన్నారు. మా సంతోషానికి అంతులేదు. తిరుపతి చేరుకున్నాము. అక్కడ స్వామి మా ఇద్దరిని కూర్చోబెట్టుకుని పాటలు పాడించుకునేవారు. ఒకనాటి రాత్రి మేమిద్దరమూ పడుకుంటే శ్రీబాబు మా ఇద్దరి జడలను ముడివేసి, మేమిద్దరమూ మా జడలు అటూఇటూ లాక్కుంటుంటే ఆయన నవ్వుకునేవారు.

శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం క్యూలో నిలబడేవాళ్ళం. ముందుగా శ్రీబాబు దర్శనం కోసం ఎదురుచూసేవాళ్ళం. ఆయన దర్శనం అయ్యేవరకు 'ఏనాటికైనా ఈ మూగవీణ రాగాలు పలికి రాణించునా......' అని ఇద్దరం పాడేవాళ్ళం. ఇద్దరమూ బాబుగారి దర్శనం అవగానే వెంటనే పాటని మార్చేవాళ్ళం. 'గోవింద గోవింద అనరా! మనరా హరి భజన చేయరా!' అని గట్టిగా ఆయనకి వినపడేలాగ పాడేవాళ్ళం. అలా ఎంతో ఆనందంగా గడిచాయి ఆ రోజులు!

మమ్మల్నిద్దరినీ కూర్చోబెట్టుకుని 'మధురా నగరి సమీపంలో ...' అని పాట పాడించుకుని శ్రీబాబు ఆనందపారవశ్యంలో ఓలలాడేవారు. అదిచూసి మేము చాలా బాగా పాడామని ఎంతో ఆనందపడిపోయే వాళ్ళము. సద్గురుదేవులు తరువాత బోధ చేసినప్పుడు తెలిసేది 'ఆయన ఆనందపడినది ఆ గీతంలోని భావనకు అంతేకాని మేము గొప్పగా పాడామని కాదు' అని. 'అయితే ఆయన ఆనందానికి మేమేగా కారకులం'

అది మాకు తృప్తినిచ్చేది.

ఇలా ఉండగా ఒకనాడు శ్రీబాబు మాట్లాడుతూ "మీ ఇద్దరికీ పెళ్ళిచేయాలి" అన్నారు. నేను వెంటనే కలుగజేసుకుని 'ఇప్పుడే ఎందుకు బాబూ పెళ్ళి?' అని మాత్రం అన్నాను. కానీ చందూ మాత్రం పెళ్ళిమాట ఎత్తగానే, 'నేను చచ్చినాసరే పెళ్ళిమాత్రం చేసుకోను' అని బిగ్గరగా ఎక్కి ఎక్కి ఏడ్చేసింది. అప్పుడు శ్రీబాబు కలుగజేసుకుని చందూని ఊరడించి "ఏడవకమ్మా! పెళ్ళివద్దులే మనం ఆశ్రమం ఏర్పరుస్తున్నాము కదా! అందులో నీకు మంచిస్థానం ఇస్తాను. సరేనా!" అన్నారు.

ఆయన మాట ఈరోజు మనమంతా కళ్ళారా చూస్తున్నాము. చందూ నేను ఎంతో స్నేహంగా ఉండేవాళ్ళం. ఒకే దగ్గర పడుకునే వాళ్ళం. కాని ఈ రోజు చందూ (మాతాజీ) స్థితికి, నా స్థితికి నక్కకు నాగలోకాని ఉన్నంత తేడా! ఈ రోజు మాతాజీతో మాట్లాడాలంటేనే భయం!

తిరుపతిలో ఒకరోజు సాయంత్రం స్వామి దర్శనానికి వెళ్ళాము. దర్శనం అయింది. అస్సాం కమలమ్మగారు స్వామికి ఎదురుగా నిల్చుని కదలకుండా నామం చేస్తూ కనులు మూసుకుని అలాగే ఉండి పోయారు. అంతా దేవాలయం నుంచి వెళ్ళిపోయారు. నేనూ, చందూ కమలమ్మగారిని ఒక్కరిని ఒదలివెళ్ళలేక అక్కడే ఉండిపోయాము. కొంత సేపు అయిన తరువాత చందూ మాట్లాడుతూ 'సుశీలా! అంతా వెళ్ళిపోయారు మనం కూడా వెళ్ళిపోదాం' అన్నది. నేను మాత్రం ఉండి పోయాను. చందు వెళ్ళిపోయిందీ. అలా రాత్రి 12గం॥ల వరకు ఉన్న తరువాత నేను కమలమ్మ కలిసి ఇంటికి చేరాము.

శ్రీబాబు మమ్మల్ని గురించి అడిగినట్లు నాకు తెలిసింది. శ్రీబాబు మా ఇద్దరినీ చూసి, నన్ను ఉండమని, కమలమ్మగారిని ఏమీ అనలేదు. నన్ను ఉద్దేశించి మాట్లాడుతూ "పెళ్ళికాని పిల్లవి అంత అర్ధరాత్రి వరకూ అలా ఉండిపోతే అందరూ ఏమనుకుంటారు? అయినా అంత భక్తి పారవశ్యంలో మునిగి పోయావా? పోనీ నువ్వు కమలమ్మకు బాడీగార్డువా?" అని కేకలు వేశారు. కొంచెం సేపు అన్నం తిననని మారాం చేశాను. కాని గురుదేవులు ఊరుకోరు కదా! ఇంతకీ చందూ నా కోసం ఉండకుండా వచ్చేసి, శ్రీబాబుతో చెప్పిఉండవచ్చునని భావించి చాలా రోజులు చందూతో నేను మాట్లాడటం మానేశాను. కానీ ఈనాడు అలా చేయగలనా? "మరచిననూ మరపురారు మహానుభావులేను" అన్న దివ్యస్మృతి మనస్సులో నుంచి తొలగించ గలవారెవరైనా ఉన్నారా!!

# మాఘం

- రమణ ప్రసాద్

మ అఘ అంటే పాపాలు పోగొట్టుకోవటం. మాఘమాసంలో పాపాలు ఎందుకు హరిస్తాయి అంటే ఈ మాసంలో పాపాలను పోద్రోలే మాఘపౌర్ణిమను జరుపుకుంటాము.



జనవరి 26న రథసప్తమి. (సూర్యజయంతి) నాడు సూర్యారాధన చేస్తాము. ఆరోజు ఆకాశంలో గ్రహనక్షత్రాలు రథాకారంగా వుండటం చేత రథసప్తమి అనే పేరు వచ్చిందని చెబుతారు. అరుణోదయంలో స్నానంచేసి, అర్చన- జపం, ప్రదక్షిణ, నమస్కారం, అర్ఘ్యం, ధ్యానం, నిష్ఠ - అనే ఆరు పద్ధతుల ద్వారా ఆరాధన చేసి సూర్యదేవుని అనుగ్రహం పొందవచ్చు. సూర్యాధన ద్వారా దేహారోగ్యం లభిస్తుంది. 'ఆరోగ్యం భాస్కరాత్‌దిచ్ఛేత్' అని సూక్తి. సూర్య నమస్కారాలు ప్రతిరోజూ చేస్తే అన్ని వ్యాధులు నివారణ అవుతాయి. వనవాసంలో ధర్మరాజు సూర్యుని ప్రార్థించి అక్షయపాత్రను పొందాడు.

ఆ మరునాడే జనవరి 27న, భీష్మాష్టమి. కురుక్షేత్ర సంగ్రామంలో పదవరోజున శిఖండి ప్రవేశంతో అస్త్రసన్యాసం చేశాక అంపశయ్య మీదకు చేరాడు భీష్ముడు. ఉత్తరాయణ పుణ్యకాలంలో స్వచ్ఛంద మరణం పొందాలని నిర్ణయించుకున్నాడు. అది తెలిసి శ్రీహరి





స్వరూపమైన శ్రీకృష్ణుడు, పాండవులు, మహర్షులు, సాధ్యులు, కింపురుషులు అందరూ అక్కడకి చేరుకున్నారు. కృష్ణుణ్ణి చూస్తూనే విష్ణుసహస్ర నామాలు ఆశువుగా వినిపించాడు భీష్ముడు. పాండవులను ఆప్యాయంగా పలుకరించాడు. శ్రీకృష్ణుని ముఖారవిందాన్ని దర్శిస్తూ అష్టమినాడు పరమేశ్వరునిలో లయమైనాడు. భీష్ముడు అష్టమినాడు లోకాన్ని వీడినా కూడా తనకు ఇష్టమైన ఏకాదశి తిథిని భీష్మునికి అంకితం చేస్తూ భీష్మఏకాదశిగా ఆరోజు నిర్ణయించాడు శ్రీహరి!

ఫిబ్రవరి 3వ తేదీనాడు అఘములను హరింపజేసే మాఘ పూర్ణిమ అంటే గురుపూర్ణిమ. భక్తులందరూ శ్రీగురుదేవుల పాదపూజ, సత్సంగం జరుపుకుని మహాప్రసాదాన్ని స్వీకరించి మహదానందాన్ని అనుభవించే పరమపవిత్రమైన రోజు.

ఫిబ్రవరి 17 మహాశివరాత్రి. సదాశివ స్వరూపులైన శ్రీసద్గురు దేవులకు ప్రాతఃకాలం లోనే భక్తులందరూ నమక చమకాలతో మాహాభిషేకం, ఆ తరువాత పాదపూజ జరుపుకుని, మరల శ్రీసద్గురుదేవుల దివ్య హస్తాలతో ప్రతిష్ఠితమై యున్న శ్రీరామలింగేశ్వర స్వామికి సహస్ర ఘటాభిషేకము, లక్షబిల్వార్చన జరుపుకుని



అనంతరం మహాప్రసాదాన్ని స్వీకరిస్తారు. రాత్రికి నగర పర్యటన (స్వామివారి ఊరేగింపు) అనంతరం, ఉమా రామలింగేశ్వర లీలా కళ్యాణ వైభవము, జరుపుకుని భక్తులందరూ తమ జీవితములను ధన్యము చేసుకొని, శ్రీసద్గురుదేవుల కరుణా కటాక్ష వీక్షణాలకు పాత్రులవుతారు.

ఏప్రియల్ 2014లో స్పెయిన్ దేశంలోని సిల్స్ నగరంలో జరిగిన సత్సంగాల అనంతరం యువతీ యువకులు కొంతమంది శ్రీమాతాజీవారి దగ్గర కొన్ని సందేహాలను ప్రశ్నల రూపంలో వెలిబుచ్చారు. వారి సందేహ నివృత్తికి ఇచ్చిన సమాధానలను ఈ క్రింద తెలియజేస్తున్నాము....

## 1. నెగిటివ్ ఎనర్జి, పాజిటిన్ ఎనర్జి అని రెండు ఉన్నాయా? ఏదో సినిమాలో అలా చూపించారు?

మాతాజీ -

ప్రపంచంలో నెగిటివ్, పాజిటివ్ - అంటే ప్రతికూలమైనవి, అనుకూల మైనవి అని రెండు మార్గాలు ఉన్నాయి. మంచి చెడు రెండూ ఉన్నాయి. మనలో నుంచి పనికిరాని భావాలను తొలగిస్తే అప్పుడు లోపల ఉన్న అసలు 'నేను' ఆత్మ స్వరూపం అని గ్రహించ గలుగుతాము. వ్యవహారిక రీత్యా కొన్ని భావాలు, పనులు చేయాల్సి ఉంటే అవి ఎంతవరకూ అవసరమో, అంతవరకే వాటిని చేయాలి. ఆధ్యాత్మిక శక్తి అన్నటికన్న గొప్పది. దానినే ఇంగ్లీషులో **Spiritulal Power or Energy** అంటారు. ప్రహ్లాదుడిది అటువంటి శక్తి. దాని ద్వారా మానవునిలో కలిగే ప్రేరణ గొప్పది. అటువంటి శక్తి కలిగినవారు మంచినే ప్రసరింపజేస్తారు. హిరణ్యకశిపుడుది **Negative Power or Energy. Spiritulal Power**ని గుర్తించి, అనుభవించి, ప్రకాశించినవారు, ప్రకాశిస్తున్నవారు మన భారతదేశంలో ఎంతోమంది ఉన్నారు.

## 2. పాప పుణ్యాలు బ్యాంక్‌లో జమ అవడం అంటే ఏమిటి?

మాతాజీ -

కష్టపడి సంపాదించేవాడు చాలా జాగ్రత్తగా ధనాన్ని ఖర్చు పెడతాడు. బ్రతకడానికి ఎంత కావాలో అంత ఉంచుకుని, మిగతాది పుణ్యకార్యాలకి, ధర్మకార్యాలకి వినియోగిస్తాడు. తల్లిదండ్రులు తినీ తినకుండా పిల్లల కోసం ఆదాచేసి, చివరికి ఆ డబ్బు వారు అనుభవించకుండానే మరణిస్తారు. తేరగా వస్తే ఖర్చుపెట్టేవారు

కొంతమంది ఉంటారు. ఇంకా కొంత మంది కోటీశ్వరులకు ఎంత సంపాదించినా ఇంకా తృప్తి ఉండదు. ఆ ధన సంపాదనలో వారి ఆరోగ్యం దెబ్బతింటుంది. తినడానికి కూడా ఉండదు. అశాంతికి గురౌతారు. ఇటువంటి వారు ఉన్న దరిద్రులు. అటువంటివారు 'ధనమూల మిదం జగత్' అని భావిస్తారు.

ధనం మనల్ని పోషిస్తున్నదా? మనమే ధనాన్ని పోషిస్తున్నామా? తేరగా డబ్బు దొరికితే ఖర్చుచేసే సోమరులకి, పేరాశతో డబ్బు సంపాదించే వారికి లక్ష్మీదేవి అంటే లక్ష్యం లేదు.

మొదటచెప్పిన వారు తమ అవసరాలకు మాత్రం ధనం వినియోగించి మిగిలిన దానితో ధర్మకార్యాలు చేస్తారు. వారి కాలం పుణ్యకాలంలో జమ అవుతుంది. వారు చేసే సద్విచారణ, సత్కర్మలు నిత్యకాలంలో జమ అవుతాయి.

వీటికి వ్యతిరేకంగా ఉండే నడక స్వార్థం కోసం ధనార్జన, పేరాశతో చేసే సంపాదన, సోమరి జీవితం, ధనాన్ని దుర్వినియోగ పరచే వారి కర్మలు సత్ఫలితాలను ఇవ్వవు సరికదా అవి వారి పతనానికి దారి తీస్తాయి.

దీనినే పాప, పుణ్యాలు బ్యాంక్‌లో జమ అవడం అంటారు.

- సశేషం

నిజంగా నీవు మనశ్శాంతిని
కోరుకుంటున్నట్లయితే,
ఎదుటివారి లోని తప్పులను
ఎంచటం మానివేయి.

- శ్రీ శారదాదేవి

# భోగి - భోగం

- రమణ ప్రసాద్

(ధనుర్మాసంలో శ్రీమాతాజీ బోధామృతం)

క్షీరసాగర తరంగ శీకరా! సారతార కిత చారు మూర్తయే।
భోగి భోగ శయనీయ శయినే మాధవాయ మధు విద్విషేనమః॥
- ముకుందమాల

"ముకుందమాలలోని శ్లోకాలు శ్రీగురుదేవులు మా చేత ఎన్నోసార్లు పాడించి, ఆనందించేవారు. ఈ శ్లోకాలను వినడంతోపాటు టి.వీ ఉంటే ఇంకా బాగుంటుంది. ఇక్కడ మనం చూసేది డైరెక్ట్ టి.వీ.యే.

క్షీర సాగరం ఎక్కడ ఉంది? పాల సముద్రంలో. పాల సముద్రంలో ఉన్నది నారాయణుడే కదా. ఆ మహానారాయణుడే సృష్టి కర్త. వారే మన గురునారాయణులు. మన నుదుటిని ఏమంటారు? 'ఫాల భాగం' అంటారు కదా! ఈ ఫాలభాగం (అదే భ్రూమధ్యం ,ఆజ్ఞాచక్రస్థానం)లో శ్రీసద్గురు దేవులు ప్రసాదించారు అదే 'రక్ష'. వారు మనకు రక్షపెట్టి, 'నా స్వరూపం నీ ఫాలభాగంలో ప్రకాశిస్తోంది. దానిని అందుకొని ఊర్ధ్వముఖంగా వెడితే సహస్రారంలో స్వామిని దర్శించ గలుగుతావు' అన్నారు. అక్కడ ప్రాణశక్తిని కేంద్రీకరించాలి.

'ఓం త్ర్యయంబకం యజామహే సుగంధిం పుష్టి వర్ధనం. ఊర్వారుక మివ బంధనాత్ మృత్యోర్ముక్షీయ మామృతాత్' అంటూ మనం విభూది ధరిస్తాం. అదే మృత్యుంజయ మంత్రం. 'ఏవిధంగా దోసపండు తన తొడిమ నుండి విడి వడుతుందో అదే విధంగా నువ్వు మృత్యువు నుండి అమృతత్వాన్ని పొందుతావు' అని దాని అర్థం.

ధ్యానంలో నిటారుగా ధీరుడవై కూర్చోవాలి. ఒళ్ళు ముడుచుకుని కూర్చోకూడదు. రిలాక్స్‌డ్‌గా ఉండాలి. భృకుటి అంటే భ్రూమధ్యం. అక్కడే జరుగుతుంది సాగర మథనం.

శ్రీగురుదేవులు రక్ష పెట్టే సమయంలో, నీ మనస్సులోకి లౌకిక విషయాలు రానీయకుండా దృష్టిని భ్రూమధ్యంలో నిలపాలి. ఏ విధంగా బెల్లం కాచేటప్పుడు తుక్కు పైకి వస్తే దానిని తొలగించివేసి, స్వచ్ఛమైన బెల్లం తయారుచేస్తారో అదే విధంగా నీ మనస్సులోని ఆలోచనలను తొలగించుకోవాలి. ధ్యానాగ్నిలో మీ మనస్సులోని వాసనలను వ్రేల్చాలి.

అప్పుడు నీ ప్రభువు చరణారవింద దర్శనం అవుతుంది. వారి పాదములనే కాక మనకి పదములు అందించి **'Why Fear? I am here!'** అని చెప్పారు. అది గుర్తించినవారు ధన్యులు!

చిన్తయామి హరిమేవ సన్తతమ్ - నీ చింతలన్నిటిని విడిచి హరినే చింతనచేయి. 'ప్రభువు నా వాడు. నా స్వంత ప్రాపర్టీ' అని విశ్వసించు. మన్దమన్దహసితాననాంబుజమ్ - ఆయనది విరిసీ విరియని చిరునవ్వు. అమ్మ ముఖం చూడండి ఎంత ప్రసన్నంగా వుంటుందో! ఆమె మందహాస వదని. అయ్యో! కృష్ణుడికి కళ్యాణం అయిపోయిందే. మనకి దూరం అయ్యాడే అని భావించకండి. కృష్ణుడు మనకెప్పుడూ బుజ్జికన్నయ్యే!

నారదాది మునిబృంద వన్దితమ్ - ఎక్కడో ఎప్పుడో నారదాది మునులు సేవించటం కాదు. మనకి శ్రీగురుదేవుల దర్శన స్పర్శన సంభాషణ వందనాదులు పుష్కలంగా లభించాయి. అది ఎన్ని జన్మల పుణ్య ఫలమే! ఆత్మానుభూతిని పొందాలంటే వారి బోధలను శ్రద్ధగా విని, విచారణ చేయాలి. తల్లి గర్భం నుండి వచ్చాక మనలో ఎన్నో మార్పులు వచ్చాయి. బాల్య యౌవన కౌమార్య వృద్ధావస్థలు వచ్చాయి. మానవుడు భర్తగా, తండ్రిగా, తాతగా పిలవబడుతున్నా తాను ఒక్కడే. కాని మనలో మారని వస్తువు ఒకటున్నది. శ్రీ గురుదేవులు తమ శిష్యులకు అట్టి దివ్యానుభవాన్ని పొందజేసి వారిని అమృత స్వరూపులుగా చేస్తారు. అట్టి గురుతత్త్వాన్ని అందుకున్న నిజమైన శిష్యునికి నిరంతరం భోగే, నిత్యమూ భోగమే.

అట్టి గురుదేవులైన శ్రీబాబుని తెలుసుకోవటం ఎవరి తరం? ఆయన ఎవరని? ఎంతని తెలుసుకోగలం? ఆకాశానికి సరిహద్దులున్నాయా? అది సర్వవ్యాపకం. పత్రమా? భుజంగమా? అంటే రెండూ వారే. వారే బుజ్జి బాలునిగా మనలను కరుణించిన పరమాత్మ స్వరూపులు! సాగరమా? అది భక్త హృదయమా? ఒక్కొక్క భక్తుడు తన హృదయంలో గురుదేవులను ప్రతిష్ఠించుకుని ఆనందాంబుధిలో ఓలలాడుతున్నాడు. దాని లోతు, విస్తీర్ణము హరిహరాదులకు కూడా తెలియదేమో!

( తరువాయి 38 వ పేజీలో చూడండి)

# గోవింద దేవాలయ అర్చకులు

- శ్రీరామకృష్ణ బోధామృతం నుండి

పూర్వపు రోజులలో జయపురంలోని దేవాలయార్చకులు వివాహం చేసుకునేవారు కాదు. అప్పుడు వారు ఆత్మతేజో విరాజితులై ఉండేవారు. ఒకసారి రాజు తన వద్దకు రమ్మనమని వారికి కబురు చేయగా 'రాజునే ఇక్కడకు రమ్మనమనండి' అని బదులు చెప్పారు.

కాని కాలక్రమాన వాళ్ళు వివాహాలు చేసుకోసాగారు. అప్పుడు రాజుకి ఇహ వారిని పిలువనంపవలసిన పనే లేకపోయింది! వారు తమంతటతామే వెళ్ళి 'మహారాజా! ప్రభూ! మిమ్మల్ని దీవించటానికి ఏతెంచాము. మీ కోసం దేవాలయం నుండి ప్రసాదం తెచ్చాము. స్వీకరించండి' అని వేడుకునేవారు. వారు అలా చేయక తప్పింది కాదు. పాపం! ఆ నిర్భాగ్యులు ఏం చేయగలరు?

ఒకరోజు ఇల్లు కట్టుకునే అక్కర, మరోరోజు పిల్లలకు అన్నప్రాసన ముచ్చట, ఇంకోరోజు కుమార్తె వివాహం - ఇలా అడుగడుగునా అవసరాలే ఎదురయ్యాయి! వీటికోసం ధనం కావాలి కదా! అందుకోసం రాజుగారిని యాచించక తప్పలేదాయె!

ఇతరుల వద్ద సేవ చేస్తూ మీరెలాటి నీచస్థితిలో ఉన్నారో మీ అంతట మీకే తెలుస్తుంది. పాశ్చాత్య పద్ధతి ప్రకారం బాగా విద్యను అభ్యసించిన మీ యువకులు - మీ ఆంగ్ల విద్యా పండితులు- నోరెత్తక అధికారులచేత తన్నులు తింటున్నారు!

ఈ అవమానాలకు, ఈ బానిసత్వానికి మూలకారణం మీకు తెలుసా?

"కామిని - వ్యామోహం".

ఈ జీవితానికి మూలం ఏదైఉన్నది? తల్లిదండ్రులేనా? స్థిరమైన భక్తితో నిలబడిన ప్రహ్లాదుని పేరు ముందుకు వచ్చింది. అటువంటి వారిని మాటిమాటికిమన ముందుకు తీసుకువస్తే, వారిని చూసి మనం నేర్చుకుంటామని పెద్దలు ఆశిస్తారు. అది ఒక చరిత్రగా భావించకండి.

ఇక్కడ గురువులు ఎట్లా ఉన్నారు? "ఎవరికి అంతం లేదో, ఆది మధ్య అంతములు లేవో, ఎవరికి కరచరణములు లేవో, పేరు గోత్రము సూత్రము లేవో, ఎవరికి జాతి వర్ణములు లేవో, ఎవడు పురుషుడు కాని, స్త్రీ కాని, నపుంసకుడు కాని కాదో, ఎవరికి ఆకార వికారములు లేవో, ఎవరికి జనన మరణములు లేవో, ఎవరికి పాప పుణ్యములు లేవో, ఎవరికి తత్త్వమనేది సహజ సమరసమో అటువంటి గురుదేవులకు నమస్కరిస్తున్నాను." అని గురుగీత చెబుతోంది.



మన వీపు మనకు కనిపించటం లేదని వీపు లేదు అనుకుంటున్నామా? భగవంతుడు కనుపించటం లేదని లేడనటానికి వీలులేదు. ఆర్తి ఆవేదన ఎక్కడ వుంటుందో అక్కడ భగవంతుడు తప్పక కనిపిస్తాడు. భగవంతుణ్ణి తెలుసుకోవటానికి సులువైన మార్గము నామస్మరణ. ఎందరో భక్తులు ఈ భగవన్నామంలో ఓలలాడి ధన్యులయ్యారు! అని మనం ఘంటాపదంగా చెప్పుకోవచ్చు.

మనలో చాలామందికి శ్రీబాబూజీతో అనుభవాలు ఉన్నాయి. ఎందరో భక్తులు 'మాకు బాబూజీ దర్శనం అయింద'ని చెబుతున్నారు. ఎవరితో బాబూజీ లేరు? ఇక్కడ ఉన్నదంతా బాబూజీయే. అదే ఆరాధన అంటే. దానిని అనుభవంలోకి తెచ్చుకునే ప్రయత్నం చేయండి..

సత్యమిది. ఏది సత్యం? అంటే ఏదైనా మార్పు చెందేదే.

దేహమనేది మార్పు చెందకుండా వుండదు. కాని మార్పు చెందనిది ఒకటుంది. అది మార్పు చెందేది కాదు. అది తెలుసుకోవాలి.

చైతన్య మహాప్రభువు చిన్నప్పటి నుంచి భగవన్నామంలో మునిగి తేలుతుండేవాడు. వాళ్ళమ్మ రోజూ మడికట్టుకుని నీరు తెచ్చుకునేది. ఈ పిల్లవాడు కారణజన్ముడు. ఎంతమందినో ఉద్ధరించటానికి వచ్చినవాడు కదా! ఎవరైనా బిచ్చగాళ్ళు వస్తే యింట్లో ఉన్నది ఏదో ఒకటి యిచ్చి తీసుకోమనేవాడు. తల్లి చూసి 'అయ్యయ్యో! వాడిని తాకేశాడు వీడు' అనుకుంటూ లబోదిబోమంటూ వేగంగా వస్తుంటే, ఆ బాలుడు (గౌరాంగుడు) 'అమ్మా!' అంటూ ఆమె వద్దకు పరుగెత్తాడు. ఆమె 'నన్ను ముట్టుకోవద్దు' అన్నది. గౌరాంగుడు "దేనిని నువ్వు ముట్టుకోవద్దని అంటున్నావు? ఈ దేహము జడము. స్వయంగా ప్రకాశించలేదు. అన్నింటి లోనూ ప్రకాశించేది ఆత్మ" అని చెప్పగానే, ఆవిడ వెంటనే తాను తెస్తున్న నీళ్ళ బిందె క్రిందపెట్టి "నువ్వు లోక కళ్యాణం కోసం జన్మించావని పెద్దలు చెబితే అప్పుడు నాకు అది అవగతం అవలేదు. నిజంగా నువ్వు నా కనులు తెరిపించటానికి పుట్టిన వాడివి. నాకు ఒక్క దానికే కాదు, జగత్తు అంతటికి కనులు తెరిపించటానికి పుట్టావని గుర్తించాను నాయనా!" అన్నది.

మనస్సుకి దోషదృష్టిని కలిగించే మాలిన్యాన్ని కడిగేసుకోవాలి. అవి ఫారిన్ సబ్బులకు, శీకాయికు వదిలేవి కావు. కేవలం భగవన్నామం, తత్త్వవిచారణ ద్వారానే అది సంభవం. భగవన్నామంలో రమించాలి. తత్త్వ విచారణతో దాన్ని శుద్ధి చేసుకోవాలి. మహాత్ముల సన్నిధిలో సత్సంగం ద్వారా అది పునీతం అవుతుంది. అటువంటి మహాత్ముల గురించి ఎన్ని రోజులు చెప్పుకున్నా తరగదు. ఏ కార్యమైనా గురుదేవులు చేయించుకో వలసినేదే కాని మనవలన కాదు.

మనందరం చక్కగా గురుపాదాల చెంతచేరి, వారు సూచించిన మార్గాన్ని మనం గమ్యస్థానం చేరేవరకు వదిలిపెట్టకుండా ఉండేందుకు కావలసిన శక్తిని, భక్తిని, సాధన సంపత్తిని గురుదేవులు ప్రసాదించెదరు గాక!

(గత సంచిక తరువాయి) **హనుమద్వైభవము** - సుషమ్నా ప్రసాద

సూక్ష్మరూపంతో అమ్మకూర్చున్న వృక్షముయొక్క కొమ్మపై నుండి సీతమ్మతో ఎలా సంభాషించాలా అని ఆలోచించి, శ్రీరామకథను గానం చేయటం ఉచితమని నిర్ణయించుకున్నాడు. అమ్మను నమ్మించటానికి హృదయాన్ని ఉల్లాసపరచటానికి ఇంతకంటె మంచి మార్గము లేదని గ్రహించాడు.



మధురంగా గానం చేయటం కూడా మారుతికి అందవేసిన చెయ్యి. జానకీమాతతో సంభాషించి రామచంద్ర ప్రభువు ఆనవాలుగా ఇచ్చిన అంగుళీయకాన్ని యిచ్చి, ఆమెకు ఊరటని చేకూర్చాడు.

ఆమె బదులిచ్చిన చూడామణిని స్వీకరించి, అచిరకాలంలోనే ఆమె తన దివ్య నాథుని చేరుకోగలనని హామి యిచ్చాడు. అతులిత బల సంపన్నుడు, నిరుపమాన ప్రతిభాశాలి అయినప్పటికి, అనిలాత్మజునకు స్వాతిశయము, గర్వము కించిత్ అయినా లేవు.

వినయమే అతని భూషణము. సీతమ్మతో సుగ్రీవుని దగ్గరున్న వానరులందరూ తనకంటె పరాక్రమశాలురు, ప్రతిభా సంపన్నులని, వారందరు ఆమె పతి సంగమునకు సాయపడతారని హామీ యిచ్చాడు. 'అందరికంటె తక్కువ బలశాలిని అయిన నన్ను దూతగా పంపించారు' అని చెప్పాడు.

తరువాత కార్యక్రమాన్ని ఆలోచించి, సీతాన్వేష్వణ ఫలించినంత మాత్రాన తాను వచ్చిన కార్యము సంపూర్ణము కాలేదని, ప్రత్యర్థుల బలా పరాక్రమములు అంచనా వేయటం కూడా దౌత్యనిర్వహణలో భాగమని, ఆ కార్యమునకు ఉపక్రమించాడు. అమ్మ కూర్చున్న వృక్షము తప్ప అశోక వనంలోని వృక్షాలనినటి కొమ్మలు విరిచి చెల్లాచెదరు చేసి, భీభిత్సం సృష్టించాడు. రాక్షస స్త్రీలావిషయమును రావణాసురనకు తెలియ జేయగా, రావణాసురుడు కోపోద్రిక్తుడై, రాక్షస వీరులను హనుమను

హతమార్చటానికి పంపాడు. వారందరని చిటికలో మట్టుపెట్టాడు. తరువాత మంత్రి ప్రహస్తుని పుత్రులను, రావణాసురుని కుమారుడు అక్షయ కుమారుని అంతమొందించాడు. ఆ వానరుని ప్రతిభకు ఆశ్చర్య పడి అనివార్య పరిస్థితులలో తనకు కుమారుడైన మేఘనాధుని పంపాడు. రావణాసురుని సందర్శించి, సంభాషించటానికి హనుమ మేఘనాధుడు వేసిన బ్రహ్మాస్త్రమునకు మూర్ఛిల్లి, కట్టుబడినట్లు నటించి, రావణబ్రహ్మ రాజదర్బారుకు చేరుకున్నాడు.

ఆంజనేయుడు ఎంత బలసంపున్నుడైనా ప్రతిభాశాలియైనా, తన గురుదేవుడైన శ్రీరామచంద్రుని సన్నిధిలో తలవంచి, నమస్కరిస్తూ ఉంటాడు. వినయ విధేయతలు, భక్తిశ్రద్ధలు ఆంజనేయునకు కొట్టిన పిండి. ఆంజనేయుని అద్భుత పరాక్రమము అసమాన్యము. కొండను అరచేతియందు మోసిన మహాబలుడు. తలతిరిగిన రాక్షసులను సైతం పాదాక్రాంతులుగా చేసిన అఖండశక్తి సంపన్నుడు. అయినా సరే తన ప్రభువైన శ్రీరామునిసన్నిధిలో, పెద్దలసన్నిధిలో ఎంతో భక్తిభావ సంపన్నుడై వినయ విధేయతలతో, బాష్పవారి పరిపూర్ణ లోచనుడై, వినమిత శిరస్కుడై సద్గురు సన్నిధిలో సంచరించాడు.

దాస భక్తిలో హనుమను మించిన భక్తుడు, ముల్లోకములలో కానరాడు. దూతను చంపటం సమంజసం కాదని విభీషణుడు అన్నగారి ప్రయత్నాలు భంగం చేశాడు. అప్పుడు రాక్షసేంద్రుడు వాయుపుత్రుని వాలమునకు నిప్పంటించమని ఆదేశించాడు. సీతమ్మతల్లి దివ్యానుగ్రహ ప్రభావముచే అగ్ని ఆంజనేయునకు ఎట్టి బాధ పెట్టలేదు. తపన, వేడిమి కించిత్తైనా లేదు. సీతమ్మ అనుగ్రహంచేత, శీతల పవనాలు వీచి, పవన కుమారునకు హాయిని చేకూర్చాయి. చేసిన పనికి ప్రతిఫలము అనుభవించ వలెనన్నట్లు, హనుమ తనవాలముతో లంకా నగరంలోని గృహాలన్నిటినీ (విభీషణుని గృహం తప్ప) నిప్పంటించాడు. ఆ లంక దహనం చేసినది ఎవరా అని రాక్షసులందరూ తీవ్రంగా ఆలోచించి, తోక చల్లార్చు కొన్న వాయు పుత్రునితో 'నీవు ఎవడవు?' అని ప్రశ్నించారు.

- సశేషం

# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

(గత సంచిక తరువాయి) - విజయేశ్వరానంద ప్రసాద్

ఎవరైనా ఏదైనా తెలుసుకోవాలనిగాని, నేర్చుకోవాలనిగాని ఏదైనా వ్యక్తిగత సమస్యలతోగాని శ్రీబాబు వద్దకు వెళ్ళే అవకాశం లేక గురువుగారి వద్దకు వస్తే, ఎవరు ఎప్పుడు వచ్చినా ఆమె ఓపికగా వారితో సంభాషించే వారు. ఎంతో ప్రేమగా వారిని ఆదరించి, చేతనైనంత సేవచేసి అవసరమైతే శ్రీబాబుతో కూడా సంప్రదించి వాళ్ళకు ఉపశాంతి కలిగించేవారు.



సత్సంగ సమావేశాలలో శ్రీబాబు గురువు గారిని నిల్చోబెట్టి ఏదైనా విషయాన్ని గురించి వివరించమనేవారు. ఆ విషయాన్ని ఎంత బాగా వివరిస్తే అంతకంటె సూక్ష్మంగాను, సారభూతంగాను శ్రీబాబు విశదీకరించేవారు. ఒకొక్కసారి కావాలని ఏదైనా చిక్కు ప్రశ్న వేసి, దానిపై ఆసక్తికరమైన చర్చను సాగించేవారు. ఆ చర్చ వినేవారికి విషయ వివరణను అందిస్తూ గురువుగారి విషయ విమర్శనా శక్తికి మరింత పదునుపెడుతూ ఉభయ తారకంగా జరిగేది.

ఉదాహరణకు ప్రతీ దీపావళి పండుగకు జరిగే సత్సంగ సమావేశంలో శ్రీబాబు నరకాసుర వధను గురించి గురువుగారిని చెప్పమనేవారు. గురువుగారు “కృష్ణుడు అలసిపోయినప్పుడు సత్యభామ విల్లు అందుకని నరకసారునితో పోరాడి తానే నరకాసురుని వధించింది. అది స్త్రీ శక్తి. అది సత్య గొప్పతనం” అని చెప్పేవారు. శ్రీబాబు “ఓహో! నువ్వు స్త్రీవి కనుక సత్యభామను సమర్థిస్తున్నావా! సత్యభామకు ఆ శక్తిని దానిని ప్రదర్శించే అవకాశాన్ని ప్రసాదించినవాడు శ్రీకృష్ణుడు కాదా!” అనేవారు. అక్కడి నుంచి “పురుష శక్తి గొప్పదా? స్త్రీశక్తి గొప్పదా? ఏమి ఇందిరా? ఏమి వెంకటరత్నం? ఏమంటారు అవధానిగారూ? (డా॥ ప్రసాద రావుగారు)” అని ఇలా భక్తులను లేపుతూ శ్రీకృష్ణునివైపు కొందరు, సత్యభామ వైపు మాట్లాడుతుంటే తాను సాక్షి మాత్రులుగా వింటూ, నవ్వుకుంటూ కొంతసేపు భక్తుల మధ్య పసందైన చర్చను కొనసాగించే వారు. చివరకు శ్రీబాబు కలుగజేసుకుని “భగవంతుడు నిరాకారుడు

నిర్గుణుడు, సృష్టి స్థితి లయములకు ఆయన సాక్షిమాత్రుడు. ఆయన యొక్క అనంతమైన శక్తియే సగుణంగా జగన్మాత రూపంలో సృష్టి స్థితి లయకారిణి అవుతున్నది. భగవానుడు ఆయిన శక్తి అభిన్నము. అలాగే ఇక్కడ శ్రీకృష్ణుడు తాను నిమిత్తమాత్రుడై యుండి, తన శక్తి యొక్క స్వరూపమైన సత్యభామతో నరకాసుర వధ చేయించాడు. అక్కడ సత్యభామ అనే వ్యక్తి వేరుగా లేదు. శ్రీకృష్ణుని శక్తియే సత్యభామ స్వరూపము" అని సూత్రీకరించేవారు.

ఆశ్రమ స్థాపనానంతరము గురువుగారు ఆశ్రమంలో ఉండి చేసుకున్న సేవ అపారము. శ్రీబాబు దర్శనానికి ఎవరైనా భక్తులు ఇతర గ్రామాల నుండి వస్తే గురువుగారు వారందరికీ స్వయంగా వంటచేసి, వడ్డించి, కొసరి కొసరి తినిపించేవారు. శ్రీబాబు ఆ అతిథులతో మాట్లాడుతూనే గురువుగారికి వాళ్ళ భోజనం గురించి ముందుగానే సూచన అందించేవారు. రాత్రివేళ అయినా సరే, గురువుగారు వాళ్ళ కోసం భోజనం తయారుచేసి సిద్ధంగా ఉండేవారు. ఒకొక్కసారి శ్రీబాబుతో వాళ్ళ ఇంటర్వ్యూ (సమావేశం) ముగిసేసరికి అర్ధరాత్రి దాటేది. ఆశ్రమంలోని ఇతర భక్తులు గురువుగారితో "అమ్మా! మీరు విశ్రాంతి తీసుకోండి. ఆ అతిథులకు మేము భోజనం పెడతాము" అంటే ఒప్పుకునే వారు కాదు. స్వయంగా వడ్డించి, తృప్తిగా వారితో తినిపిస్తేగాని ఆమెకు శాంతి ఉండేది కాదు. అందుకనే ఎందరో భక్తులు "ఆమె అన్నపూర్ణమ్మ తల్లి. కన్నతల్లి కూడా అంత ఆత్మీయంగా భోజనం తినిపించదు" అని ఇప్పటికీ తలచుకుంటారు.

ఇన్ని కార్యక్రమాలలోనూ సేవలలోనూ పాల్గొంటున్నా ఆమె ఎన్నడూ ప్రార్థనకుగాని, పూజలకుగాని, సత్సంగ సమావేశాలకుగాని, ఆశ్రమంలోని ఏ ఇతర కార్యక్రమాలకుగాని రాకుండా ఉండేవారు కాదు. శ్రీబాబు అవతార పరిసమాప్తి అనంతరం ఆమెకు కాన్సర్ (రాచపుండు) వ్యాధి వచ్చింది. ఎంతో బాధతో మెలికలు తిరిగిపోయేవారు. అయినా ఎన్నడూ ఏ కార్యక్రమమూ వదులుకునేవారు కాదు. ఊరికేవచ్చి కూర్చోవటమే కాదు క్రియాశీలంగా అన్నికార్యక్రమాలలో పాల్గొనేవారు. ఆ వ్యాధి బాధను అనుభవిస్తూ కూడా ఆమె శ్రీబాబు విషయం భగవత్ విషయం తప్ప మరేదీ ఎన్నడూ ఎవరితోనూ మాట్లాడేవారు కాదు. భక్తులకు మరింత సేవ చేసుకోవాలని ఆమె తీవ్రమైన కోరికను

తీర్చటానికా అన్నట్లు అంతటి వ్యాధినుండి శ్రీబాబు ఆమెకు పరిపూర్ణ స్వస్థతను చేకూర్చారు. మరింత ఉత్సాహంతో మళ్ళీ అన్ని సేవలు చేసుకున్నారు. ఆశ్రమ పీఠాధిపతిగా పూజ్యశ్రీ మాతాజీ తమ బాధ్యతలను పరిపూర్ణ సామర్థ్యంతో నిర్వర్తించేందుకు ఓపినంత సేవను ప్రోత్సాహాన్ని సూచనలను అందించి, శ్రీమాతాజీకి కుడి భుజంవలె దండుగా నిల్చారు.

పార్థివ శరీరంతో ఒక మానవుడు చేయగలిగినంత సాధనను సేవను ఉపకారమును త్యాగమును ఆమెతో నిర్వర్తింపజేసి, ఆశ్రమ చరిత్రలో ఆ మహాభక్తురాలికి ఒక చిరస్మరణీయమైన స్థానమును కల్పించి శ్రీబాబు 1997 మార్చి 11వ తేదీన ఆ భక్తురాలిని తనలో లయింప జేసుకున్నారు.

● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ● ●

(భోగి- భోగం 30వ, పేజీ తరువాయి)

అయితే నీ విశ్వాసం చెదరకూడదు. పెరుగుతోడుపెట్టి అస్తమానం కదిలిస్తే పెరుగు అవుతుందా? అది చేదుగా అవుతుంది.నీ లక్ష్యార్థ సాధన కొన సాగిస్తూనే ఉండు. 'ఎంతవరకు చేశాను' అనుకోవద్దు. మనకి ఎప్పుడు ఏది ఇవ్వాలో అది గురుదేవులే ఇస్తారు. ఇక్కడ మనం ఏ పని చేసినా అది సేవే. కాని 'నేను చేస్తున్నాను' అనుకుంటే అది పొరపాటు. 'శ్రీగురు దేవులే చేయిస్తున్నారు' అనే భావన ఉండాలి. గాఢ నమ్మకమే మహా పథ్యం. అటువంటి గురుదేవులు మనకు ఆశ్రయాన్నిచ్చి అండగా నిల్చారు. అట్టి శ్రీగురుదేవులు మనకు శక్తిని భక్తిని సాధనా సంపత్తిని ప్రసాదించెదరు గాక!!"

## అనుబంధం

శ్రీమాతాజీవారు తమ దివ్య ప్రసంగంలో తెలిపిన ముఖ్యమైన సాధనా రహస్యం - భ్రూమధ్యంలో చేసే సాగర మథనం (లక్ష్యార్థ సాధన) దీనినే 'ఆజ్ఞాచక్ర సాధన' అంటారు.

సుఖాసనంలో కూర్చుని వెన్ను మెడ తల నిటారుగా ఉంచాలి. మనస్సును ఏకాగ్రం చేసి అర్ధనిమీలిత నేత్రాలతో గాని, కనులు మూసుకుని గాని దృష్టిని భ్రూమధ్యంలో నిలపాలి. శ్వాస నార్మల్‌గా వుండాలి. భ్రుకుటిలో చిదాకాశంలో తెల్లటికాంతి ప్రసరిస్తున్నట్లుగా భావించి, మనస్సు లక్ష్యమూర్తిపై నిలపాలి. ఇలా 10ని॥లు ప్రతిరోజూ చేస్తే ఆజ్ఞాచక్రంలో నీ లక్ష్యామూర్తి దర్శనం అవుతుంది.

-గత సంచిక తరువాయి

## విష్ణు  కథలు

- రమణ ప్రసాద్

# కబీర్‌దాస్

తల్లి కబీరుతో "నీవు నేసిన వస్త్రాన్ని అంగడికి పోయి విక్రయించి ధనం తీసుకురమ్మ"ని చెప్పింది. కబీర్ అంగడికి పోయి రామధ్యానంలో వచ్చినపని మరచిపోయాడు. జనం అతడు నేసిన వస్త్రాన్ని చూసి "ఇది ఎంతో విలువైనది, దీనిని మనం కొనలేం" అని వెనుతిరిగి పోతున్నారు. సాయంత్రం అయింది. తను ఆ వస్త్రాన్ని విక్రయించకుండా వెళ్తే తల్లి దండిస్తుందని తలచాడు. ఇంతలో ఒక బ్రాహ్మణుడు వచ్చి కబీరు ముందు నిలచి "అయ్యా! నేను పేదవాడను. నాకు ధరించుటకు వస్త్రాలు లేవు" అన్నాడు. కబీర్ తన దగ్గరలో ఉన్న గుడ్డలో సగభాగం అతడికి ఇస్తూ 'అతడు రాముడే' అని అనుభూతి పొందాడు.



కొంతసేపటికి ఒక ముస్లిం ఫకీర్ వచ్చాడు. "ఈ పేద ఫకీరుకు బట్టను దానం చేస్తారా?" అని అడిగాడు. మిగిలిన గుడ్డను ఫకీర్‌కు ఇచ్చి కబీరు తృప్తి పడ్డాడు. ఆ ఫకీరు కబీరును "ఓయీ! జగధీశుడు అరూపి కదా! నువ్వు ఎందుకు సరూప ధ్యానం చేస్తున్నావు" అని ప్రశ్నించాడు. కబీర్ "జగధీశుడికి అరూప స్వరూపాలు రెండూ సమంగా ఉంటాయి. అరూపి అయిన భగవంతుడు భక్తుల కోసం స్వరూపంగా అవతరించి తన దర్శనాన్ని ప్రసాదిస్తాడు. భగవంతునిది దివ్యాత్మ స్వరూపము. భగవంతుడు శుద్ధ సత్వ మందు దివ్య మంగళ పరిగ్రహంచేత ఒక రూపంలో ఉన్నట్లు కనిపిస్తాడు. పరమాత్మను ప్రతివారూ వారి వారి ఇచ్ఛానుసారంగా భజింపవచ్చును" అని చెప్పాడు.

ఆ తరువాత, కబీర్ ఒక పాడుపడిన గుడిసెలో ధ్యానంలో ఉండి పోయాడు. జగధీశుడు ఒక బ్రాహ్మణుని రూపంలో కబీర్ తల్లి దగ్గరకు పోయి "అమ్మా! నీ పుత్రుడు వస్త్రమును విక్రయించక సగం వస్త్రంను బ్రాహ్మణుడికి, మిగిలిన సగం ఒక ఫకీరుకు దానం చేసి ఒక గుడిసెలో ధ్యానం చేస్తున్నాడు. ఇదంతా నేను దూరంగా ఉండి చూశాను. నాకు

చాలా బాధగా ఉంది. మీరు సుఖంగా ఉండాలనే నా కోరిక" అని మెల్లగా అంటించాడు. ఆమె కోపం మిన్నులు దాటింది. "వాడు ఇంటికి రానీ, వాడి పని చెబుతాను" అన్నది. ఆ బ్రాహ్మణుడు "వాడు ఇంటికి రాడు. మీకు భయపడి దాక్కున్నాడు. నాతో రండి చూపిస్తాను" అన్నాడు.

కబీర్ తల్లి బ్రాహ్మణునితో ఆ గుడిసెకు వెళ్ళి కబీర్‌ని "వస్త్రము ఎక్కడ?" అని నిలదీసింది. ధ్యానమగ్నుడైన కబీర్ పలకలేదు. ఆమె కబీర్ భయంతో చెప్పటం లేదని భావించి, ఒక కర్రతో కబీర్‌ను కొట్టింది. ధ్యానమగ్నుడైన కబీర్‌కు అది తెలియలేదు. కాని ఆ దెబ్బలు బ్రాహ్మణ వేషధారి అయిన దాశరథికి తగిలాయి.

"కబీర్‌ను శిక్షించేటట్లు చేశాను. ఆ ఫలితాన్ని నేనే పొందాను" అంటూ శ్రీరాముడు ధనుష్పాణి అయి సీతాలక్ష్మణ సమేతుడై ఆంజనేయుడు వెంటనుండగా కబీర్‌కు, అతని తల్లికి దర్శనం ఇచ్చాడు. ఆ స్వామి కబీర్ తల్లితో "నీవంటి పుణ్యాత్మురాలు ఈ లోకంలో లేదు. నీ భాగ్యం ఏమని చెప్పను? నువ్వు కూడా రాముణ్ణి ఆరాధించు" అని చెప్పాడు. ఆమె కబీర్‌తో "నాయనా! నీ మూలంగా నాకు కూడా రామదర్శనం కలిగింది" అని ఆనందపరవశ అయింది.

భగవానుడే బ్రాహ్మణుని రూపంలోనూ ఫకీరు రూపంలోనూ వచ్చి బట్టలను కబీర్ నుండి గ్రహించాడు. కబీర్ భగవానుడినే వారిలో దర్శించాడు.

కబీర్ ఆప్ ఠగాయియే ఔరన ఠగియే కోయ్
ఆప్ ఠగే సుఖ ఊపజే ఔర్ ఠగే దుఃఖ హొయ్ ॥

"ఓ రామా నన్ను మోసగించలేవు. నువ్వు మోసపోతే మాకు సుఖ శాంతులు కలుగుతాయి. మేము మోసగింపబడితే మిగిలేది దుఃఖమే."

- సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - DUGGIRALA JAGANMOHANA BALA KRISHNA LAL